తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## శ్రీచెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.58.51 లక్షలు

సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవి దేవస్థానంలో హుండీలను గురువారం లెక్కించారు. 105 రోజులకు గాను 58 లక్షల 51 వేల 539 రూపాయలు హుండీల ద్వారా ఆదాయంగా లభించింది. యూఎస్‌ఏ డాలర్లు 27, యూఏఇ దిరహమ్స్ 5, మలేషియా రింగిట్ ఒకటి, కువైట్ 1/4 దినార్, సింగపూర్ డాలర్ 10, వియత్నాం దోన్ 20, ఇంగ్లాండ్ పౌండ్స్ 5, ఫిలిప్పైన్స్ 100 పిసో, 45 గ్రాముల బంగారం, 120 గ్రాముల వెండి హుండీల ద్వారా లభించింది. దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు పర్యవేక్షణలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ లెక్కింపు జరిగింది.

## తడకండ్రిగలో వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం

తడ, జూన్ 27 ప్రభాతవార్త

తడ మండలం తడకండ్రిగలో పోలేరమ్మ జాతర మహోత్సవం గురువారంతో ముగిసింది. ఉదయం అంగరంగ వైభవంగా బాణాసంచా వేడుకలతో పోలేరమ్మ ఉత్సవం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తడకండ్రిగ పురాతన గ్రామమని, తమ గ్రామంలో పోలేరమ్మ తరతరాలుగా ఉందని, గత మూడేళ్లుగా ఇక్కడ ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నామని విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి ఏడుమలైరెడ్డి తెలిపారు.



# పెద్దిరెడ్డికి ఎదురుదెబ్బ

### సొంత మునిసిపాలిటీ చైర్మెన్ సహా పలువురు తెదేపాలో చేరిక



తెదేపాలో చేరిన పుంగనూరు మునిసిల్ చైర్మెన్ కౌన్సిలర్‌లు

రొంపిచెర్ల, జూన్ 27 ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా వైకాపా ప్రభుత్వంలో నెంబరు 2గా మెలిగిన అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పుంగనూరులో వరుస దెబ్బలు తగులుతున్నాయి. ఎన్నికల అనంతరం ఇటీవల ఆయన పుంగనూరుకు వచ్చేందుకు ప్రయత్నించగా పెద్దిరెడ్డి గోబ్యాక్ అంటూ పుంగనూరులో తెదేపా శ్రేణులు నిరశన తెలిపాయి. దీనితో ఆయన చౌడేపల్లెనుంచి వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఆతర్వాత అయినా ఆయన తనను నమ్ముకున్న క్యాడర్‌ను కలిసి ధైర్యం చెప్ప లేక పోయారు. దీనితో నియోజక వర్గంలో ఉన్న ఏకైక మునినిసాలిటీ పుంగనూరు చైర్మెన్ సహా 17 మంది కౌన్సిలర్‌లు గురువారం రొంపిచెర్లకు వచ్చి తెదేపా పుంగనూరు నియెజక వర్గ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సమక్షంలో తెదేపాలో చేరారు. ఈసందర్భంగా మునిసిపల్ చైర్మెన్ అలీంబాషా మాట్లాడుతూ తాము వైకాపా హయాంలో కుర్చీలకే పరిమితం అయ్యాము తప్ప అధికారానికి పనికి రాలేక పోయామన్నారు. తాము ప్రజా ప్రతినిదులమైనా కూడా అధికారం మొత్తం వైకాపా నాయకులదే అన్నారు. తాము ఏపనీ ధైర్యంగా చేయలేక పోయామన్నారు. ప్రతి చిన్న విషయంలో కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వారి మనుషులు, పిఏలు విపరీతంగా కలుగ చేసుకుని వేదించేవారన్నారు. ఇక తాము ఉండలేక వచ్చేశామని పేర్కొన్నారు. ఈసందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ తెదేపా హయాంలో అభివృద్ధిని అడ్డు కోవడం జరగదని చెప్పారు. అబివృద్ధి కోసం తాము కృషి చేస్తామని ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇక అభివృద్ధిని వేగవంతం చేస్తామన్నారు. కార్యక్రమంలో చైర్మెన్‌తో పాటు కౌన్సిలర్‌లు రామకృష్ణంరాజు, రహంతుల్లా, నరసింహులు, యువకుమారి, మమత,కలీదర్‌మొదలియార్, కాన్ నూర్జహాన్, కసురున్నీసా, మనోహర, అర్షద్ ఆలీ, రేష్మా, గౌస్‌తదితరులు తెదేపాలో చేరారు.

## విజిలెన్స్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీల వెనుక / టార్గెట్ ఎవరు!?

### టిటిడి ఇంజనీరింగ్‌లో నిధులు స్వాహా అయ్యాయా??దర్శనాల టిక్కెట్లపై విచారణ సాగిస్తారా!!

### -టిటిడిలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న అధికారులు

ప్రభాతవార్తప్రతినిధి/తిరుమల,తిరుపతి:

ధార్మికసంస్థ టిటిడిలోనిధులు దుబారా జరిగాయా!?అంచనాలకు మించి మంజూరుచేసి పక్కదారిపట్టించారా అనే అనుమానాలు ఇప్పుడు టిటిడి ఉద్యోగులను కలవరపరుస్తున్నాయి. ఇదివరకు టిటిడి చరిత్రలో జరగని విధంగా నిధులు విచ్చలవిడిగా పలు అభివృద్ధి పనుల పేరుతో మంజూరుచేసి, ఇంకా పనులు మొదలుపెట్టని నిధులు స్వాహా చేశారా? అనే అంశాలుకూడా చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని టిటిడి బోర్డుపై ,కొందరు ఉన్నతాధికారుల వ్యవహారంపై తీవ్రంగా పరిగణిస్తున్న తిరుపతి పరిరక్షణ కమిటీ, శ్రీవారి భక్తులతో బాటు కూటమి ప్రభుత్వంలో టిటిడిలో తాజా మాజీ అధికారిని టార్గెట్ చేసి ప్రభుత్వ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ విభాగంతో సోదాలు చేయించారనే విషయం హాట్‌టాఫిక్‌గా మారింది. ఇవన్నీ నిజం చేసేలా రెండురోజుల పాటు విజయవాడ ప్రధానకేంద్రంగా ఉన్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంగ్ విభాగం అధికారులు ఒక ఎస్పీ, ఇద్దరు డిఎస్పీలు, ఇద్దరు సిఐలు తిరుపతి, తిరుమలకు చేరుకుని ఇటీవల బోర్డులో ఆమోదించిన నిధులు కేటాయింపు పనులు, పెద్ద మొత్తంలో నిధులు మంజూరు, ఆర్జితసేవల టిక్కెట్లు జారీ, శ్రీవాణి ట్రస్ట్ బ్రేక్ దర్శనాలు జారీ తదితరాలపై నిశితంగా కూఫీ లాగారనేది ఉద్యోగుల్లోనూ వినిపిస్తున్న వాదనలు. మరీ ఈ వాదనలు నిజమైతే ప్రభుత్వం టార్గెట్ చేస్తున్నదెవరినీ? మాజీ ఈఓనా, మాజీ బోర్డు ఛైర్మన్లనా??అనేది అంతుచిక్కని విషయాలు చర్చకు దారితీస్తోంది. మొత్తంమీద ఎన్నికలకు మూడునెలల ముందు టిటిడి బోర్డు పలు దఫాలుగా సమావేశమవడం, అభివృద్ధిపనుల పేరుతో తిరుమల తిరుపతికి భారీగా నిధులు విడుదల చేయడం వంటివి ఇప్పుడు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారుల సోదాల్లో నిగ్గుతేలాల్సిన విషయం. వరుసగా జనవరి,ఫిబ్రవరి, మార్చినెలల్లో జరిగిన బోర్డు సమావేశాల్లో కేటాయించిన నిధులు, గత బోర్డు హయాంలో పలు అభివృద్ధి పనుల పేరుతో మంజూరైన నిధులు ఏమేరకు వ్యయం చేశారు,ఎన్ని పనులు పూర్తిచేశారు అనే కోణంలో విజిలెన్స్ విచారణ సాగింది. ఈ అంశాలపై నిశితంగా పరిశీలన చేసి రికార్డులను కూడా ఇంజనీరింగ్ విభాగం నుండి పట్టుకెళ్లారని తెలుస్తోంది.



తిరుపతికి చెందిన శ్రీవారి భక్తుడు, బిజెపి నేత నవీన్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు టిటిడిలో నిధులు గోల్‌మాల్, ఇంజనీరింగ్ పనులకు కేటాయించిన నిధులు దుబారా అంశాలపై విచారణ మొదలైంది. ఈ విచారణలో అసలు టార్గెట్ ఎవరనేది ఈ నెలాఖరులోపు తేలనుందనేది అందరిలోనూ వినిపిస్తున్న విషయం. మరీ ఈ రెండు రోజుల తనిఖీల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు అక్రమాలపై ఎంతవరకు విషయాలు రాబట్టారనేది కూడా తెలియాల్సి వుంది. రెండు రోజులు తిరుమల,తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలో తనిఖీల సమయంలో ఎవరినీ అనుమతించలేదు. పైగా టిటిడిలోనే ప్రత్యేకంగా విజిలెన్స్ విభాగం ఉన్నా మరీ అక్రమాలపై ఎందుకు ప్రశ్నించలేకపోయిందనే వాదన వినిపిస్తోంది. మరీ దేవుని సొమ్మును దుబారా చేశారా?లేదా అనేది తేలాల్సి ఉంది.

# జూలై 1న పెంచిన పెన్షన్లు ఇళ్ల వద్దే పంపిణీ

### ఉదయం 6గంటలనుంచే ప్రారంభం.. : జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త

ఎన్టీఆర్ పెన్షన్ల పథకం అమలులో భాగంగా జూలై 1వతేదిన రాష్ట్ర ప్రభుత్వం పెంచిన సామాజిక పెన్షన్ల నగదును లబ్దిదారుల ఇళ్ల వద్దనే నేరుగా పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కుప్పం నుంచి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒకటో కేటగిరీలో వచ్చే వృద్ధులు, వితంతువులు తదితర 11 ఉప కేటగిరీలకు చెందిన వారి పింఛను నగదు రూ 3వేలనుంచి 4వేలకు పెంచడం జరిగిందన్నారు. అలాగే గతంలో ప్రకటించిన మాదిరిగానే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి అరియర్లు నెలకు రూ 1000ల వంతున మొత్తం రూ 7000లను పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే రెండో కేటగిరీలో పాక్షిక దివ్యాంగులకు రూ 3వేలనుంచి 6వేలు, మూడో కేటగిరీలోని దివ్యాంగులకు 5వేలనుంచి రూ 15వేలు చెల్లించాలన్నారు. నాలుగో కేటగిరీలో కిడ్నీ, తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ 5వేలనుంచి రూ 10వేల పెన్షన్ నగదు పంపిణీ చేయాలన్నారు. ఐదో కేటగిరీలోని వారికి గతంలో వలే ఎలాంటి మార్పులు లేకుండా యధావిధిగా నగదు పంపిణీ చేయాలని ఆదేశించారు. జూలై 1న ఉదయం 6గంటలనుంచే పింఛనుదారుల ఇళ్ల వద్దనే పింఛన్ల నగదు పంపిణీకి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పాటు అవసరం ఉన్న ఎడల ఇతర శాఖ ఉద్యోగుల సేవలు వినియోగించుకోవాలన్నారు. సాధ్యమైనంత మేర తొలిరోజే ఈ పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి చేయాలని అనివార్య కారణాలతో ఎవరైనా మిగిలిపోయి ఉంటే రెండో రోజు పంపిణీ కార్యక్రమం కొనసాగించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్డీఎ, మెప్మా పిడిలు తులసి, రాధమ్మ, జడ్పీ సిఇఒ గ్లోరియా, ఎల్‌డిఎం హరీష్, ఆర్డీఒలు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

## కుప్పంలో కొత్త మండలాల ఏర్పాటుకు

# సిఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్

### మండల కేంద్రాలు కానున్న రాళ్లబూదుగూరు.. మల్లానూరు

### ప్రత్యేక కమిటీచే నివేదికల తయారీకై అధికారుల కసరత్తులు !!

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త

తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో ఇప్పటికే ఉన్న నాలుగు మండలాలకు తోడు కొత్తగా నియోజక వర్గంలో రెండు కొత్త మండలాలను ఏర్పాటుచేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించిన విషయం విదితమే. ప్రస్తుతం శాంతిపురం మండలంలో ఉన్న రాళ్లబూదుగూరు, కుప్పం మండలంలో ఉన్న మల్లానూరు కేంద్రాలుగా నూతన మండలాల ఏర్పాటుకు సిఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మండల ఏర్పాటుకు సంబంధించి ప్రత్యేక కమిటీని నియమిస్తూ సిఎం చంద్రబాబు కార్యదర్శి ప్రద్యుమ్న ఈనెల 24నే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కొత్త కమిటీ నేతృత్వంలో అధికార యంత్రాంగం రెండు నూతన మండలాల ఏర్పాటుకు సంబంధించి నివేదికల తయారీకై కసరత్తులు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి డిపిఆర్‌ను రూపొందించి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు. సుదీర్ఘకాలంగా రాళ్లబూదుగూరు, మల్లానూరులను మండల కేంద్రాలు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ నేపథ ్యంలో మేజర్ గ్రామ పంచాయతీలు అయిన ఈ రెండు గ్రామాలను మండల కేంద్రాలు చేయనున్నారు.

**ఉన్న పంచాయతీలతోనే మండలాల విభజన :**

కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురం మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా శాంతిపురం మండల కేంద్రంగా ఉంది. ప్రస్తుతం రాళ్లబూదుగూరు కొత్త మండలంగా ఏర్పడితే ఉన్న 23 పంచాయతీల్లోని పలు పంచాయతీలు కొత్త మండల పరిధిలోకి రానున్నాయి. మేజర్ పంచాయతీ అయిన రాళ్లబూదుగూరుతో పాటు 64పెద్దూరు, 121పెద్దూరు, కోనేరుకుప్పం, సి.బండపల్లి, బిఎం గొల్లపల్లితో పాటు పలు పంచాయతీలు రాళ్లబూదుగూరు మండలంలో రానున్నాయి. అలాగే కుప్పం మండలంలో ఉన్న 28 గ్రామ పంచాయతీలకు కుప్పం మండల కేంద్రంగా ఉంది. మల్లానూరు కొత్త మండలంగా ఏర్పడితే ఈ ఇప్పటికే ఉన్న పంచాయతీలైన మేజర్ పంచాయతీ మల్లానూరు, గరిగచీనేపల్లి, మిట్టపల్లి, కొటాలూరు, అడవిబూదుగూరు, చెక్కునత్తం, వానగుట్టపల్లి తదితర పంచాయతీలు కొత్త మండలం మల్లానూరు పరిధిలో రానున్నాయి. జనాభా పరంగా కూడా రాళ్లబూదుగూరు, మల్లానూరు పంచాయతీలు పెద్ద పంచాయతీలే. ఈ నేపథ్యంలో కొత్త మండలాలు ఏర్పాటుతో డివిజన్‌లో ఆరు మండలాలు కానున్నాయి. సాధ్యమైనంత త్వరగా కొత్త మండలాల ఏర్పాటుకు అధికారులు యుద్ధప్రాతిపదికన కసరత్తు చేస్తున్నారు. అన్నీ కుదిరితే ఆర్నెల్లలోపే కొత్త మండలాల ప్రకటన అధికారికంగా వెలువడనుంది.

## పింఛన్ల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్ ధ్యానచంద్ర

తిరుపతి కార్పొరేషన్, జూన్ 27, ప్రభాతవార్త

సామాజిక భద్రత పింఛన్లు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంగా పేరు మార్పు చేయబడిందని, పెంపుదల చేసిన సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ జూలై 1న పంపిణీ చేసిన సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ జూలై 1న పంపిణీ చేసే అంశం విధి విధానాలపై రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత కార్యదర్శులు రాష్ట్ర గృహ నిర్మాణ, గ్రామ, వార్డు సచివాలయాల స్పెషల్ సిఎస్ అజయ్ జైన్, పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్, ఆర్థిక శాఖ కార్యదర్శులు సౌరబ్ గౌర్, సత్యనారాయణ, గ్రామ వార్డు సచివాలయాల శాఖ సంచాలకులు శివప్రసాద్ తదితరులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా తతిరుపతి జిల్లా నుంచి కలెక్టర్ ధ్యాన చంద్ర హెచ్‌ఎం సంబంధిత అధికారులతో కలిసి హాజరైయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎనీటార్ భరోసా పింఛన్లను జూలై ఒకటో తేదీన ఉదయం 6 గంటల నుండి పెన్షనర్ల ఇంటి వద్దే గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ఆధార్ బయోమెట్రిక్ లేదా ముఖ ఆధారిత లేదా ఐరిస్ లేదా రియల్ టైమ్ బెనిఫిసరి ఐడెంటిఫికేషన్ సిస్టమ్ అతెంటికేషన్ బేస్డ్‌గా పంపిణీ చేయాలని ఆదేశించారు. అదే రోజు పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలన్నారు. ఏమైనా మిగిలిపోయినచో మరుసటి రోజున తప్పక పూర్తి చేయాలని సూచించారు. మొత్తం నాలుగు రకాల క్యాటగిరీల పింఛనుదారులలో 11 సబ్ క్యాటగిరీలకు చెందిన పెన్షన్ దారులకు మొత్తం రూ. 7000 అంటే జూలై మాసానికి సంబంధించి రూ. 4 వేలు ఏప్రిల్, మే, జూన్ మూడు నెలలకు సంబంధించి నెలకు వెయ్యి చొప్పున అరియర్స్ మొత్తం రూ. 3 వేలు పంపిణీ చేయాలని ఆదేశించారు. అంగవైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు ఇస్తున్న రూ. 5 వేల పింఛన్‌ను రూ. 15 వేల రూపాయలకు పెంచినట్లు చెప్పారు. కిడ్నీ, లివర్, బైలెట్రల్ ఎలిఫెంటాసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇస్తున్న ఫించన్‌ను రూ. 5 వేల నుంచి రూ. 10 వేల రూపాయిలకు పెంచినట్లు చెప్పారు. ఏఆర్‌టి , ఇతర రాష్ట్రాల్లో విద్యను అభ్యసిస్తున్న దివ్యాంగులైన విద్యార్థులకు సదరు పెన్షన్ పంపిణీ డిబిటీ ద్వారా నేరుగా వారి అకౌంటుకు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.



## జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు



చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

జడ్పీ సిఇఓగా విధులు నిర్వర్తించి ప్రస్తుతం బైరెడ్డి పల్లి ఎంపిడిఓగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డిపై పంచాయతీరాజ్ కమీషనర్ కన్నబాబు సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పీ సిఇఓగా ప్రభాకర్‌రెడ్డి విధులు నిర్వహించిన సమయంలో జిల్లా పరిషత్ కార్యాలయం పరిధిలో పలు ఆర్థిక అవకతవకలు, పరిపాలన పరమైన అవకతవకలు జరిగినట్లు పంచాయతీరాజ్ కమీషనర్‌కు ఫిర్యాదులు వెళ్ళాయి. ఈ ఫిర్యాదులపై విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాల్సింది గా పంచాయతీ రాజ్ కమీషనర్ కన్నబాబు కలెక్టర్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఇచ్చిన నివేదిక మేరకు పంచాయ తీరాజ్ కమీషనర్ కన్నబాబు జడ్పీ సిఇఓగా విధులు నిర్వర్తించిన ప్రభాకర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేశారు.

# బదిలీలపై కసరత్తు

### పోస్టింగ్స్ కోసం అధికార పార్టీ ఎమ్మెల్యే చుట్టూ ప్రదిక్షిణలు

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త:

ఎన్నికల హడావుడి సర్దుమణగడం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై పరిపాలన ప్రారంభించడంతో అధికారులు, ఉద్యోగుల బదిలీలపై కసరత్తు ప్రారంభమైంది. ఇప్పటికే ఇక్కడ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన సగిలి షన్మోహన్‌ను ప్రభుత్వం బదిలీ చేసి జిల్లాకు నూతన కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ నియమితులయ్యారు. వారం రోజుల్లో జిల్లాలో పెద్ద ఎత్తున జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారుల బదిలీలు చేయడానికి కసరత్తు జరుగుతుంది. జిల్లాలో ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి ఇతర జిల్లాల నుండి జిల్లాకు తహసిల్దార్లు, ఎంపిడిఓలు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నికల విధులు నిర్వర్తించడానికి జిల్లాకు వచ్చిన అధికారులు వారి జిల్లాలకు వెళ్ళాల్సి వుంటుంది. వీరు వారి జిల్లాలకు బదిలీపై వెళితే ఇక్కడికి ఎన్నికల విధులు నిర్వర్తించడానికి ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్ళిన వారు మళ్ళీ వచ్చి విధుల్లో చేరాల్సి వుంటుంది. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రభుత్వ ప్రాధాన్యతలు పూర్తి చేయడంలో ఎవరైనా సక్రమంగా విధులు నిర్వహిస్తారో అలాంటి అధికారులను తమ ప్రాంతాలకు బదిలీ చేయించుకోవడం అధికార పార్టీ నాయకుల ఉద్దేశం. ఈ మేరకు ఇప్పటికే అనుకూలమైన ప్రాంతాల్లో పోస్టింగ్స్ కోసం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు స్థానికంగా వుండే అధికార పార్టీ ఎమ్మెల్యేలు చుట్టూ ప్రదిక్షిణలు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుండి ఎన్నికల విధులు ముగించుకుని ఇక్కడ పోస్టింగ్ పొందడానికి వస్తున్న తహసిల్దార్లు తమకు అనుకూలమైన ప్రాంతంలో పోస్టింగ్ వేయించుకోవడానికి ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఇక జిల్లా పరిషత్ విషయానికి వస్తే రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైనప్పటికీ జిల్లా పరిషత్‌లో మాత్రం వైకాపా మరో రెండేళ్ళపాటు అధికారంలో వుంటుంది. జిల్లా పరిషత్‌లో వైకాపా ఛైర్మన్ వుండటంతో ప్రస్తుతం జరిగే బదిలీల్లో ఎంపిడిఓల బదిలీలు పరిమితంగా జరిగే అవకాశం కన్పిస్తుంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా మొత్తంకు జిల్లా పరిషత్ కావడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 65 మండలాలు జడ్పీ కిందికి వస్తాయి. జడ్పీ ఛైర్మన్, జడ్పీ వైస్ ఛైర్మన్లు విభజిత చిత్తూరు జిల్లా వాసులు కావడంతో విభజిన చిత్తూరు జిల్లాలోని కీలక మండలాల్లో ఎంపిడిఓలను తమ గుప్పిట్లో పెట్టుకొని మిగిలిన మండలాల ఎంపిడిఓల బదిలీలకు ఎలాంటి అభ్యంతరం చెప్పకపోవచ్చునని భావిస్తున్నారు. ఇక మరో కీలక శాఖ అయిన పోలీసు శాఖలో ప్రభుత్వం మారడంతో బదిలీలు ఇప్పటికే ప్రారంభం అయ్యాయి. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తునన కుప్పం నియోజకవర్గంలో ఇద్దరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు బదిలీ అయ్యారు. ఇక్కడ ఇది వరకు సర్కిల్ ఇన్స్‌పెక్టర్లుగా విధులు నిర్వర్తించిన వారిని అనంతపురం విఆర్‌కు బదిలీ చేశారు. చిత్తూరు జిల్లాలో 9 మంది డిఎస్పీలు, 13 మంది సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు వున్నారు. ప్రస్తుతం జరుగనున్న బదిలీల్లో వీరిలో అత్యధిక మంది పోలీసు అధికారులు బదిలీ అయ్యే అవకాశాలు వున్నాయి. ఇప్పటికే డిఎస్పీలు, సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలుగా బదిలీపై వచ్చే ప్రాంతంకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యేను కలిసి తమ పేర్లను సిఫార్సు చేయాల్సిందిగా కోరుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలో మరో వారం రోజుల్లో జిల్లాలో తహసిల్దార్లు, పోలీసు అధికారులు భారీగా ఎంపిడిఓల బదిలీలు పాక్షికంగా జరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## ముక్కంటీశుని సేవాభాగ్యం ఎవరికో!

### కొత్త ఇఓ నియామకమా? పాతవారికే అవకాశమా?

శ్రీకాళహస్తి జూన్ 27 ప్రభావార్త



శ్రీకాళహస్తీశ్వరాలయ పాలనా బాధ్యతకు కొత్త ఇఓను తీసుకొస్తారా? లేక పాతవారికే అవకాశం కల్పిస్తారా? అనేది పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 30న ఇక్కడ పనిచేస్తున్న ఇఓ ఎస్‌వి నాగేశ్వరరావు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో పాలకులు కొత్త వారిని నియమిస్తారా? లేక పరిపాలన సర్దుబాట్లు అయ్యేవరకు వేచి ట్రైనీ ఐఏఎస్ అధికారిని తెచ్చి ఇక్కడ పరిపాలనను గాడిలో పెడతారా? అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే జూలై 1నుంచి శ్రీకాళహస్తీశ్వరుని పరిపాలన బాధ్యతను కొత్త ఇఓను నియమించే వరకు తిరుపతిలోని దేవాదాయశాఖకు చెందిన ఆర్‌జెసి కే.వి.యన్.మూర్తికి అప్పగించనున్నట్లు చర్చించుకుంటున్నారు. అయితే ఇక్కడ గతంలో పనిచేసిన ఇఓ సాగర్‌బాబు ప్రయత్నిస్తున్నట్లు ఆలయంలో చర్చించుకుంటున్నారు.

**పదవి కొత్త కానీ పరిపాలన కొత్త కాదు . . .**

శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా గెలిచిన తెలుగుదేశం నాయకుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి ఎంఎల్‌ఏ పదవి కొత్త కానీ. ఆయనకు శ్రీకాళహస్తిలోని అడుగడుగు తెలుసు. ఏ శాఖలో ఎవరు ఎలా పని చేస్తారో? తెలుసు. ఎక్కడ ఎవరు అధికారాన్ని ఉపయోగించుకొని లాభపడుతూ పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారో కూడా బాగా తెలుసు.కాబట్టి ఆయన పరిపాలనలో తనదైన మార్కు ప్రదర్శించుకొనుటకు 'తండ్రికన్నా మంచి పాలన ఇస్తున్న తనయుడు అనే పేరు' తెచ్చుకోవాలనే దిశగా అడుగులేస్తున్నారు.ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో ప్రజలు కోరుకునే పాలన అందించాలంటే రెండు సామాజిక వర్గాలకు పాలనా బాధ్యతలు ఇవ్వరాదని ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.దాంతో తన తండ్రి ఆశయం మేరకు ఇక్కడకు ట్రైనీ ఐఏఎస్ అధికారిని తెస్తారని స్థానికులు భావిస్తున్నారు. శ్రీకాళహస్తిలోని దేవాలయంలో పరిపాలన పూర్తిగా గాడి తప్పింది.అంతేకాక పవిత్రమైన ఆలయంలో అవినీతి, అవకతవకల పరిపాలన సాగుతుంది. కాబట్టి ఇక్కడ తన ఆలోచనలకు అనుగుణమైన పాలన కోసం మంచి అధికారి అన్వేషణలో ఉన్నట్లు తెలిసింది.

## పేదలకు అండగా నేషనల్ హ్యూమన్ రైట్స్



చిత్తూరురూరల్, జూన్ 27 ప్రభాతవార్త: అన్యాయాన్ని ఎదిరించి పోరాడడంలో నేషనల్ హ్యూమన్‌రైట్స్ ముందుంటుందని, అలాగే మా సభ్యులు ఎల్లవేళలా నిరుపేదలకు అండగా వుంటారని నేషనల్ చీఫ్ సెక్రటరీ బుల్లెట్ రవి పేర్కొన్నారు. గురువారం హ్యూమన్ రైట్స్ కార్యాలయంలో కమిటి సభ్యులచే ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు డా.ధనంజయనాయుడు మాట్లాడుతూ నేషనల్‌హ్యూమన్ రైట్స్ కల్పించిన హక్కులు ప్రజలు ఉపయోగించుకోవాలనీ, ఇటీవల గుడిపాలమండలం చిత్తపార(గ్రామంలో నందిని అనే యువతిని ఆస్తితగాదా విషయంలో దారుణంగా కొట్టి చిత్రహింసలు పెట్టడంతో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ అండగా నిలిచి అతనిపై కేసు నమోదు చేయించి జైలుకు సైతం పంపడం జరిగిందన్నారు. అనంతరం ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యులను దుశ్శాలువతో సత్కరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు పూర్ణచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, జిల్లా కన్వీనర్ టివి రమణ, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ రమేష్‌బాబు, చిత్తూరునగర అధ్యక్షులుఎమ్మెస్ రమణ, ఉపాధ్యక్షులు సురేష్‌లతో పాటు ఇతక మండలాలకు చెందిన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్దుని దర్శించుకున్న మాజీమంత్రి కళా వెంకట్రావ్

కాణిపాకం, జూన్ 27 ప్రభాతవార్త:



రాష్ట్ర మాజీ మంత్రి కమిడి కళావెంకట్రావ్ గురువారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారికి వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

## వాసు ట్రస్ట్‌చే విద్యాసామాగ్రి వితరణ

ఐరాల, జూన్ 27 ప్రభాతవార్త: మండలంలోని 35 యర్లంపల్లె ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు వాసు ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా విద్యాసామా(గిని పంపిణీ చేశారు. పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు ట్రస్ట్ నిర్వహకులు ఎస్.రాజారాం,ఎస్.సుబ్రమణ్యం, ఎస్.ఈశ్వర్‌ల ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు, పెన్సిల్ ప్లేట్స్ తతదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ-2 దామోదర్‌నాయుడు, పాఠశాల హెచ్‌ఎం.కెఅజిత, స్థానిక సర్పంచ్ కె.మల్లీశ్వరి, ఎంపీటీసీ లతా రాజేష్‌రెడ్డి, జూపార్కు మాజీ డైరక్టర్ మణియాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రబాబు, పవన్‌ల పేరిట పత్యేకపూజలు



కాణిపాకం, జూన్ 27 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేరిట కాణిపాకం ఆలయంలో గురువారం దేవస్థానం మాజీ ఛైర్మన్ లతా రాజ్‌కుమార్ ప్రత్యేకపూజలు నిర్వహించారు. కుప్పంలో చంద్రబాబు, పిఠాపురంలో పవన కళ్యాణ్‌లు అత్యధిక మెజారిటీతో గెలుపొంది ఎన్డీడే కూటమి రాష్ట్రంలో కేంద్రంలో, రాష్ట్రంలో అధికారం చేపట్టాలని స్వామివారిని మొకు ్కకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కుటుంబసమేతంగా ఆలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పేరిటి పంచామృతాభిషేకం నిర్వహించి మొక్కులు తీర్చుకున్నట్లు లతా రాజ్‌కుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

సదుం, జూన్ 27 ప్రభాతవార్త మండల పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన జరిగింది. గ్రామస్థుల కథనం మేరకు పలమనేరు టి వడ్డిపల్లెకు చెందిన బాబు పీలేరు నుంచి పలమనేరుకు బయలుదేరి తాటిగుంటపాలెం మార్గంలో వచ్చాడు. ఆసమయంలో తాటిగుంటపాలెం పంచాయతీ రాచవారిపల్లె వద్ద తెల్లగుండ్లు వద్ద ఎదురుగా ఆర్టీసీ బస్సు వచ్చింది. దానిపక్కగా వెలుతూ అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు గాయమైంది. వెంటనే గ్రామస్థులు గుర్తించి 108 వాహనంకు పోన్ చేయగా సదుం పీలేరుల నుంచి 108 వాహనాలు వచ్చాయి. వారు ప్రథమ చికిత్స చేసిన అనంతరం పీలేరు నుంచి వచ్చిన వాహనంలో పీలేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## నేడు, రేపు అబ్జర్వర్లకు ఫైనల్ ఎక్స్‌పెండిచర్ వివరాలు

### - జిల్లా అడిట్ అధికారి కృష్ణారెడ్డి

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త: సాధారణ ఎన్నికలు-2024 ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు శుక్ర, శనివారాల్లో ఎన్నికల్లో ఖర్చు చేసిన వివరాలను అభ్యర్థులు సంతకం చేసి ఆ వివరాలను ఎన్నికల పరిశీలకులకు అందజేయాలని జిల్లా ఆడిట్ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. సాధారణ ఎన్నికలు-2024కు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన రోజు నుండి ఎన్నికల ముందు వరకు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు వారు పెట్టిన మొత్తం ఖర్చు వివరాలను పొందుపరచాల్సి వుంటుందన్నారు. పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి డిప్యూటీ రిటర్నింగ్ ఆఫీసర్, అసెంబ్లీ నియోజకవర్గాలైన పుంగనూరు, నగరి, గంగాధరెల్లూరు, చిత్తూరు, పూతల పట్టు, పలమనేరు, కుప్పం రిటర్నింగ్ ఆఫీసర్లకు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లకు కలెక్టర్ ద్వారా ఇప్పటికే మెయిల్ నోటీసులు అభ్యర్థులకు పంపడం జరిగిందన్నారు.

## సిఎం, డిప్యూటీ సిఎంల సారధ్యంలో అభివృద్ధి

శ్రీరంగరాజపురం, జూన్ 27 ప్రభాతవార్త:



సిఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌ల సారధ్యం లోకి కూటమి ప్రభుత్వం రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగా మిగా నిలుస్తోందని జనసేన, తెలుగుదేశం నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని కటికపల్లి పంచాయతీ గ్రామచివాలయంకు గురువారం సిఎం, డిప్యూటీ సిఎంల ఫోటోలు వితరణ చేసి జనసేన, తెలుగుదేశం నాయకులు మాట్లా డుతూ పంచాయతీరాజ్ వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడానికి, గత ప్రభుత్వంలో గాడి తప్పిన వ్యవస్థను గాడిలో పెట్టడానికి ప్రతి ఒక్కరు కలసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఇదే ఎన్డీఏ కూటమి లక్ష్యమని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు చిరంజీవి పేర్కొన్నారు. మండల ప్రధాన కార్యదర్శి సాయికుమార్, ఎన్డీఎ కూటమి నాయకులు, మాజీ ఎంపిటిసీ కెఎం రవి, వేమన్ననాయుడు, నాయకులు జగదీష్, శేఖర్, త్యాగరాజులునాయుడు, చిరంజీవి, పవన్, భరత్, నాగరాజు, షణ్ముగం, సర్పంచ్ మార్కొండయ్య, సచివాలయ కార్యదర్శి జ్యోతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే గురజాల ఇష్టాగోష్టి

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త: గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2024 కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు విద్యార్థులతో కలసి మెలసి ఇష్టాగోష్టి కార్యక్రమంలో పాల్గొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పాఠశాల విద్యార్థులను దగ్గరకు పిలిచి వారి యోగ క్షేమాలు అడిగి ఏం చదువుతున్నారు! తల్లిదండ్రులు ఏం చేస్తుంటారు! పాఠశాలలో అన్ని సౌకర్యాలు వున్నాయా! పాఠశాలలో సౌకర్యాలు ఎమైనా కల్పించాల్సిన అవసరం వుందా! అని ప్రశ్నలు వేసి విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అర్టీసీ అధికారులతో మాట్లాడి గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం వైఎస్‌ఆర్ నగర్, కొత్తపల్లి, ప్రశాంత్‌నగర్‌లకు అర్టీసీ బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మధ్యాహ్న భోజనం చేశారు. మున్సి పల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, మున్సిపల్ అధికారులు విద్యార్థుల మధ్యాహ్న భోజన పంక్తిలో కూర్చొని మధ్యాహ్న భోజనం వారికి కలిసి చేశారు.

## మోడల్ స్కూల్‌లో ఎమ్మెల్సీ డా॥ కంచర్లచే పుస్తకాలు పంపిణీ

శాంతిపురం, జూన్ 27 ప్రభాతవార్త మండలంలోని ఎపి మోడల్ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు ప్రభుత్వం తరపున ఉచిత పాఠ్య పుస్తకాలను ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తారని నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచ్ బాలకృష్ణ, నేతలు రమేష్, చంద్ర, చలపతి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ఐఆర్‌ఎం విద్యార్థుల ప్రతిభ



కుప్పంరూరల్, జూన్ 27 ప్రభాతవార్త ఇంటర్ సప్లిమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫలితాల్లో స్థానిక ఐఆర్‌ఎం కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కాలేజ్ ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. ఎంపిసిలో శ్రీయ 464/470, సిఇసిలో రజని 456/500, బైపిసిలో మేఘన 401/440, ఎంపిసిలో మౌనిక 443/470మార్కులతో టాపర్లుగా నిలిచారన్నారు. అలాగే సిఇసిలో ప్రవళిక 450/500, ఎంపిసిలో మోహిత 440/470మార్కులు సాధించారన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మాట తప్పని నాయకుడు

యర్రావారిపాలెం, జూన్27ప్రభాతవార్త



తలకోన నీటి సాధన కమిటీ చేసిన వినతికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి చంద్రగిరి ఎమ్మెల్యే చొరవ చూపడం ఆయన ఆడిన మాట తప్పని నాయకుడుగా పేరు పొందారని కమిటీ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం ఆయన పులివర్తి నానిని కలిసి కృతజతలు తెలిపారు. ఎమ్మెల్యే నాని తలకోన నీటి కోసం ప్లాన్ తయారు చేయమని అధికారులను ఆదేశించారని చెప్పారు. యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు,రొంపిచెర్ల, మండలాల్లోని 764 చెరువులకు తలకోన కొండల్లోనుంచి వచ్చే వర్షపు నీటిని నింపి వ్యవసాయాన్ని పరుగెత్తించాలన్నారు. కరువును పారదోలాలని చెప్పారు. ఈసందర్భంగా సాధన కమిటీ పులివర్తి నానికి శాలువతో సన్మానించారు.

## 117 జీఓను తక్షణమే రద్దు చేయాలి -ఎస్టీయూ

పెద్దపంజాణి,జూన్ 27,ప్రభాతవార్త:



177 జీఓను తక్షణమే రద్దు చేయాలని స్థానిక ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల శాఖ అధ్యక్షులు బాబురెడ్డి,జిల్లా ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ విద్యావ్యవస్థకు గొడ్డలిపెట్టుగా ఉన్న 117 జీఓను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేసి ప్రాథమిక వ్యవస్థను రక్షించాలని, ఉన్నత పాఠశాలల్లో సమాంతరంగా తెలుగు మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్టీయు పుంగనూరు డివిజనల్ కన్వీనర్ నారాయణస్వామి,ఆర్థిక కార్యదర్శి శివ ప్రసాద్,రాష్ట్ర కౌన్సిలర్ అంజాద్ అలీ ఖాన్,జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు,నాగరాజా,జిల్లా కౌన్సిలర్లు లక్ష్మీపతి బాలాజీ, మహేంద్రర్ రెడ్డి,ఉపాధ్యాయులు చంద్రశేఖర్,రెడ్డి రమేష్ హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పెద్దపంజాణి,జూన్ 27,ప్రభాతవార్త: జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పుంగనూరు డివిజన్ మలేరియా యూనిట్ అధికారి గంగయ్య ప్రజలకు సూచించారు. బసవరాజుకండ్రిగలో భావన(12) అనే బాలికకు రెండు రోజుల క్రితం తిరుపతిలో డెంగ్యూ నిర్ధారణ కావడంతో విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది గురువారం గ్రామంలో పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలో నీటితొట్టెలు,మురుగునీటి గుంతలు,మురుగునీటి కాలువల్లో అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు.మంచినీటి టాంక్యులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించారు. ఈ కార్యాక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు,రాయలపేట ఆరోగ్య కేంద్రం ఎంపీ హెచ్ఈఓ శ్రీనివాసులు,సిబ్బంది గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

## వేలం పాటద్వారా రూ. 9.01లక్షల ఆదాయం

చౌడేపల్లి, జూన్ 27 ప్రభాతవార్త మేజర్ పంచాయతీ చౌడేపల్లికి వివిధ వనరులకు నిర్వహించిన వేలం పాటద్వారా రూ. 9.01లక్షల ఆదాయం సమకూరినట్లు కార్యదర్శి సుధాకర్‌రావు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచు శ్రీరామ్ భరత్ వరుణ్ అధ్యక్షతన వేలం పాట జరిగింది. వారపు కూరగాయల సంతలో 9నెలలపాటు వసూలు చేసుకొని హక్కును రూ. 7.40లక్షలు, ప్రైవేటు బస్టాండులో గేటు వసూలు చేసుకొనే హక్కును రూ. 1.61లక్షలను గోసలకురపల్లికి చెందిన కృష్ణమూర్తి హెచ్చుగా పాడి దక్కించుకొన్నాడు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

## వ్యక్తి అదృశ్యం..పోలీసులకు ఫిర్యాదు



కుప్పంరూరల్, జూన్ 27 ప్రభాతవార్త మున్సిపల్ పరిధి లక్ష్మీపురంకు చెందిన విజయ్‌కుమార్ (34) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం నుంచి విజయ్‌కుమార్ కన్పించడం లేదని చుట్టు పక్కల గాలించినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఇతనిమానసిక స్థితి సైతం సరిగ్గాలేదని తెలిపారు. విజయ్‌కుమార్ ఆచూకీ తెలిస్తే 8686687687,9618805447నెంబర్లకు సమాచారం అందించాలని కుటుంబీకులు కోరారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

### ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి, జూన్ 27, ప్రభాతవార్త కార్మికులకు తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొరుకొండ్ల రామకృష్ణ తెలి పారు. వెంకటగిరిలోని ఆయన 90 శాతం సబ్సీడీతో చేనేత కార్మికులకు స్టాండ్ మగ్గాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల అభ్యున్న తికి ప్రభుత్వం ఎప్పుడు తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. చేనేత కార్మికులకు వచ్చే అన్ని పథకాలను అందిస్తానని చెప్పారు. మంగళగిరిలో మంత్రి నారా లోకేష్ అమలు చేస్తున్న వాటిని ఇక్కడ కూడా అమలు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్లూమ్స్ ఏడి పిచ్చేశ్వర రావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వర రావు, కౌన్సిలర్ ప్రభావతి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాజేశ్వర రావు, నాయకులు సత్యనారాయణ, మురళీకృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ

నాయుడుపేట, జూన్ 27 ప్రభాతవార్త నాయుడుపేట మండలం మందబయలు గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యనిర్వాహక కారనయదర్శి బిరదవాడ నారాయణ, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి నానబాల సుబ్బారావు, పట్టణ టిడిపి కారనయదర్శి మల్లాం రవికుమార్‌లు స్కూట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భవిత స్కూలులో హెలెన్‌కెలర్ జయంతి

సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త సూళ్లూరుపేటలోని భవిత దివ్యాంగుల పాఠశాలలో దివ్యాంగుల ఆరాధ్యదేవత హెలెన్ కెల్లర్ 144వ జయంతిని గురువారం ఎన్‌పిఆర్‌డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్ హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. హెలెన్ కెల్లర్ దివ్యాంగుల కోసం చేసిన సేవలను కొనియాడారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ఆమె తన సొంత ధనాన్ని కూడా వెచ్చించారని ప్రశంసించారు. అనంతరం ఇటీవల దాడుల్లో గాయపడిన గిరిజన దివ్యాంగుడికి రూ.2 వేలు నగదుతో పాటు పప్పు దినుసులను అందజేశారు. ఎన్‌పిఆర్‌డి అధ్యక్షురాలు నాదెండ్ల శాంతకుమారి బాధిత దివ్యాంగుడికి రూ.2 వేలు అందజేయడంతో పాటు భవిత స్కూలులో దివ్యాంగులకు స్టూడెంట్ కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత పాఠశాల ఉపాధ్యాయురాలు భార్గవి, దివ్యాంగులు సూర్య, శివ, పోలయ్య, కనకమ్మ, కుమారి, సుబ్బమ్మ, చెంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ ఉచిత వైద్యశిబిరం విజయవంతం

సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త సూళ్లూరుపేటలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీ అరవింద ఐ ఆసుపత్రి వారి సహకారంతో స్థానిక అలవల వారి రోటరీ కంటి ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని రొటేరియన్ వేనాటి ధనుంజయరెడ్డి ప్రారంభించారు. 200 మంది రోగులను పరీక్షించి, ఇందులో 65 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి తిరుపతిలో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు రోటరీ అధ్యక్షులు అట్రంబాకం దశరథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు డాక్టర్ సాయిబాబా, వెంకటలక్ష్మి, వేనాటి విజయలక్ష్మి, సుంకర ప్రతిమ, కొండా అర్చన, శ్రీరాములు యాదవ్, కొండా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు తడలో క్యాన్సర్‌పై అవగాహన

తడ, జూన్ 27 ప్రభాతవార్త :తడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం ఉచిత క్యాన్సర్ అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సూళ్లూరుపేట షార్ లయన్స్ క్లబ్ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ప్రముఖ సంస్థల నిపుణులు పాల్గొంటారని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కె.ఆదిశేషారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులుజెట్టి, క్యాంప్ ఛైర్మన్ అరుణకుమారిలు తెలిపారు.

## ప్రభుత్వంపై కలిసికట్టుగా పోరాటం చేస్తాం

### వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



వెంకటగిరి, జూన్ 27, ప్రభాతవార్త ప్రభుత్వం పై అందరం కలిసికట్టుగానే పోరాటం చేస్తామని వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో ఎమ్మెల్సీ మేరిగా మురళీధర్, మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా ఉండేందుకు అందరం కలిసికట్టుగా అవసరమైన చోటికి వెళ్లి పోరాటం చేస్తామని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. వైసిపి పార్టీ కార్యాలయాలను నిబంధనల ప్రకారమే కట్టినట్లు తెలిపారు. ఎప్పుడు ప్రజల్లోనే ఉండి సమస్యలు తెలుసుకుని అవసరమైతే పోరాటం చేస్తామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాలయ్య, నాయకులు కళ్యాణ్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కౌన్సిలర్లు పూజారి లక్ష్మి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సునీల్ కుమార్ పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



గూడూరు, జూన్ 27, ప్రభాతవార్త గూడూరు మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో గ్రామదేవత పోలేరమ్మ జాతరకు జాతర కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆయన వెంట జాతర కమిటీ సభ్యులు తానంకి నానాజీ, అల్లూరు కరుణాకర్ రెడ్డి, ఎల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, శ్రీకిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పల్లంపర్తి మధు సూధన్ రెడ్డి, మట్టం శ్రావణి, మట్టం మురళి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో బడికి పోదాం ర్యాలీ





సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త సూళ్లూరుపేట మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో బడికి పోదాం ర్యాలీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ ప్రారంభించారు. పట్టణంలో విద్యార్థులు ర్యాలీలో బడికి పోదాం నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఓలు కాపులూరు శ్రీనివాసులురెడ్డి, ఎన్.శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆచార్య భరద్వాజ సేవాసంస్థచే విద్యార్థులకు నగదు బహుమతులు



తడ, జూన్ 27 ప్రభాతవార్త సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థ వారిచే తడలో 10వ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన వారికి గురువారం నగదు బహుమతులు పంచిపెట్టారు. మండలంలో ప్రథమ స్థానం సాధించి 579 మార్కులతో శభాష్ అనిపించుకున్న బత్తుల వెంకటకీర్తికి రూ.5,116, ద్వితీయ స్థానంలో నిలిచి 574 మార్కులు సాధించిన హరిణికి రూ.4,116, తృతీయ స్థానంలో 572 మార్కులు సాధించిన బత్తుల ధనుశ్రీకి రూ.3,116 చొప్పున అందజేశారు. నాలుగవ స్థానం సాధించిన రాజా షాలిని (564 మార్కులు)కు రూ.2,116 చొప్పున అందజేశారు. మొత్తంగా మండల పరిధిలో 500 మార్కులకు పైగా సాధించిన 23 మంది విద్యార్థులకు కూడా బహుమతులు అందజేశారు. వీరితో పాటు తడ మండలం వాటంబేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చినమాంబట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తడ జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, అక్కంపేటలోని ఏపీ మోడల్ స్కూలు విద్యార్థులకు కూడా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలలో ఎంఇఓ మల్లికార్జున్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసులు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్, ఉపాధ్యాయులు, ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



నాయుడుపేట, జూన్ 27 ప్రభాతవార్త ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన స్టూడెంట్ కిట్లను గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పంపిణీ చేశారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎల్ఎసాగరం లోతువానిగుంట హైస్కూల లో ఎంఇఓ మునిరత్నంతో కలిసి పంపిణీ కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు చదువు అనే ఆయుధంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. అలాగే విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాం, జామెంట్రీ బాక్సులతో కూడిన విద్యాసామగ్రిని అందజేశారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ మునిరత్నంతో పాటు నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ ఉయ్యాల ప్రవీణ్, టిడిపి యువ నాయకులు నెలవల రాజేష్, సుధీర్‌రెడ్డి, తెలుగు యువత ఉపాధ్యక్షులు అవధానం సుధీర్, మొండెం బాబు, ఉపాధ్యాయులు గడదాసు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## తాగునీటి కొళాయిలు పరిశీలన

వాకాడు, జూన్ 27, ప్రభాతవార్త మండలంలోని అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలో భాగంగా ఇన్ఛార్జి ఎంపిడిఓ వెంకటేశ్వర రావు గురువారం పాఠశాలలోని కొళాయిలు, టాయిలెట్‌లను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని తూపిలి పాలెం, జమీన్ కొత్తపాలెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలును పంచాయితీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బందితో ఎంపిడిఓ పరిశీలించి త్రాగునీటి కొళాయిలు, బోర్లు వద్ద పరిశుభ్రం చేయాలని చూచించారు. డయేరియా పై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎంపిడిఓ వెంట సిబ్బంది ఉన్నారు.

## ప్రజలకు పరిశుభ్రమైన నీరు ఇవ్వండి : ఎంపిడిఓ

కోట, జూన్ 27 ప్రభాతవార్త వాతావరణంలో మార్పులు వస్తున్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో ప్రజలకు పంచాయతీల ద్వారా అందుతున్న నీళ్లను పరిశుభ్రంగా ఇవ్వాలని ఎంపిడిఓ శంకరయ్య కోరారు. గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16 గ్రామ సచివాలయాల పరిధిలో పైపులైన్లు, కొళాయిలను నిరంతరం తనిఖీలు చేయాలని కోరారు. ఎక్కడైనా లీకేజిలు ఉంటే వెంటనే అరికట్టాలని సూచించారు. వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయించాలని కోరారు. రోడ్ల మీద, వీధుల్లో గుంతల్లో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## జూలై 1న ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ

కోట, జూన్ 27 ప్రభాతవార్త జూలై 1వ తేదీన పింఛన్లు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ఇస్తారని ఎంపిడిఓ శంకరయ్య చెప్పారు. ఆయన గురువారం విలేఖరులతో మాట్లాడుతూ మండలంలో ఏడువేల మంది లబ్ధిదారులు ఉన్నారని చెప్పారు. ఏప్రిల్, మే, జూన్ నెలకు సంబంధించి ఒక్కొక్క లబ్ధిదారులకు రూ.7 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, కల్లుగీత కార్మికులు, వివిధ రకాల దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి ఆర్థిక ఆసరా ఇవ్వాలన్న ఉద్దేశంతో పింఛన్‌ను ప్రభుత్వం ఎన్నికలకు ముందే రూ.4 వేలకు పెంచినట్లు చెప్పారు. సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వచ్చి పింఛన్ పంపిణీ చేస్తారని తెలిపారు.

## రైతులకు గిట్టుబాటు ధర కల్పించండి



సూళ్లూరుపేట, జూన్ 27 ప్రభాతవార్త సూళ్లూరుపేట మండల పరిధిలో రైతులకు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఆర్డీఓ చంద్ర మునికి వినతిపత్రం అందజేశారు. పెద్ద రైతులకు రూ.5 లక్షలు రుణాలు అందజేసి పావలా వడ్డీని వసూలు చేయాలని కోరారు. ఎరువులు, వ్యవసాయ పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేయాలని కోరారు. రైతు భరోసాను వెంటనే రూ.20 వేలు చెల్లించాలని, రైతులకు ట్రాక్టర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లపై 50 శాతం రాయితీ, తెలుగుగంగ నీటిని ఈ ప్రాంతానికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సిపిఐ రైతు సంఘం నాయకులు ఎం.పార్థ సారధి, కె.శ్రీనివాసులు, ఎ.ఆనందబాబు, ఎ.బాలయ్య, లక్ష్మి, అశోక్‌బాబు, ప్రభుదాస్‌లు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఏపి లా సెట్‌లో మెరిసిన...ఎస్వీ జూనియర్ కళాశాల విద్యార్థులు

తిరుపతి విద్య, జూన్ 27, ప్రభాతవార్త : ఏపి లా సెట్ ప్రవేశ పరీక్షలో తిరుమల తిరుపతి దేవస్థానముల నిర్వహణలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలకు చెందిన ఎల్. గంగాధర్ 86వ ర్యాంక్, వి. లారెన్స్ 313వ ర్యాంక్ సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ సి. ప్రకాష్ బాబు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఇచ్చిన ప్రోత్సాహంతో తాము ఉన్నత ర్యాంకులను సాధించగలిగామని, కళాశాలలో ఇంటర్మీడియట్ సిలబస్‌తో పాటు పోటీ పరీక్షలకు ఇచ్చిన శిక్షణ తమకు ఎంతగానో ఉపకరించిందని, లా కోర్సు చేసి సామాన్య ప్రజలకు న్యాయపరమైన అంశాల్లో సేవ చేయాలనే ఆశయంతో కష్టించి ఉత్తమ ర్యాంక్‌లను సాధించామని వారు తెలిపారు.

## వినియోగదారులకు...మెరుగైనసేవలే ట్రాయ్ లక్ష్యం

### -ట్రాయ్ కాగ్ సభ్యుల సమావేశం నిర్ణయం



తిరుపతి, జూన్ 27ప్రభాతవార్త: టెలికాం వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా ట్రాయ్, కాగ్ పనిచేస్తుందని కాగ్ సభ్యుడు పి.చిట్టిబాబు తెలిపారు. నిరంత రాయంగా వినియోగ దారులకు ఎప్పటికప్పుడు కొత్తపథకాలు, సేవలు గురించి వివరించేందుకు, అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు దోహదపడు తుందన్నారు. గురువారం ఆర్‌సిపురం మండలం సి.రామాపురంలో కాగ్ సభ్యులు ఆధ్వర్యంలో టెలికాం వినియోగదారుల అవగాహన సదస్సు జరిగింది. మొబైల్ నంబర్ పోర్టబిలిటీ పథకాన్ని 2006 నుండి వినియోగదారుల సౌలభ్యం కోసం నిర్వహిస్తోందని, ఇప్పటివరకు 60కోట్ల మంది వినియోగదారులు ఈ పథకం వినియోగించుకున్నారన్నారు. అవాంఛిత మొబైల్‌కాల్స్‌ను నియంత్రించేందుకు 1909 నంబర్‌ను ఏర్పాటుచేసిందని చిట్టిబాబు తెలిపారు. వినియోగదారులు తమతమ సమస్యలు, కొత్త పథకాలపై అనుమానాలు నివృత్తి చేసుకున్నారు. ఈ సమావేశంలో బిఎస్ఎన్ఎల్ ఎస్‌డిఈ ప్రభాకర్, తిరుపతి జిల్లా లీగల్ సర్వీసెస్ సభ్యుడు అమర్‌నాథ్, జిల్లా వినియోగదారుల మహిళ అధ్యక్షురాలు ఏఎల్ఎస్ యువరాజులు, సంస్థప్రోగ్రామ్ అనలిస్ట్ షాలిని, ట్రైనీలు సోనియా,తేజ, వసుంధర, రజిని, సరస్వతి,గ్రామప్రజలుపాల్గొన్నారు.

## మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దు

### వినియోగదారులకు హెచ్‌డిఎఫ్సి సూచన

తిరుపతి విద్య, జూన్ 27 ప్రభాతవార్త : వాట్సాప్ గ్రూపులలో, సోషల్ మీడియాలో వస్తున్న మోసపూరిత ప్రకటనలు నమ్మవద్దని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ కంపెనీ అనుబంధ సంస్థ, హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ లిమిటెడ్ సిఓఓ సందీప్ భరద్వాజ్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ నకిలీ వాట్సాప్ గ్రూపులలో కంపెనీ, దాని అధికారుల వలె నటిస్తూ మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడుతున్న వారి పట్ల అప్రమత్తతతో వ్యవహరిస్తూ, వారి బారిన పడకుండా ఉండాలని వినియోగదారులను హెచ్చరించారు. వినియోగదారులు వాట్సాప్ గ్రూప్‌లకు జోడించడు, అధికారిక ప్లాట్ ఫారమ్‌ల వెలుపల నిధుల బదిలీ కోసం అభ్యర్థించబడదని వినియోగదారులు గుర్తు పెట్టుకోవాలన్నారు. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు లేదా గ్రూప్‌లను కస్టమర్‌లు ఎదుర్కొన్నట్లైయితే వారు వెంటనే వాటిని నిర్దేశిత కస్టమర్ సేవా బృందానికి నివేదించాలన్నారు. వినియోగదారులకు ఏదైనా సమస్య ఎదురైతే హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ కస్టమర్ సర్వీస్ 022 - 39019400లో సంప్రదించాలని సూచించారు.

## నీటి సమస్య పరిష్కార దిశగా ఆదేశాలిచ్చిన ఎమ్మెల్యే

పాకాల, జూన్ 27 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలంలోని ప్రజలు నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నట్లు సమాచారం అందుకున్న పులివర్తి నాని గురువారం సాయంత్రం 5 గంటలకు పాకాలకు చేరుకుని అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి సమస్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల వారీగా నీరు ఎంత అవసరం ఉంటుందో అంచనా వేసి నీటి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులకు ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వ పాలన వైఫల్యాలను వదిలేసి దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు తెలిపారు. మూడు నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతానని అధికారులకు తెలిపారు. అవసరం ఉన్నచోట బోర్లు పైపులైను వంటి పనులను అంచనా వేసి తెలపాలని ఎమ్మెల్యే కోరారు. అంతేకాకుండా రానున్నది వర్షాకాలం కాబట్టి విషజ్వరాలు వ్యాపించకుండా పలు సూచనలను పాటించాలని కోరారు. పరిసర ప్రాంతాలలో వ్యర్థాలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లడం, స్టోరేజ్ ట్యాంక్ క్లీనింగ్, కాలువలు శుభ్రపరచుట, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా పాకాల మండల అభివృద్ధికి పలు విషయాలపై చర్చించారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమా...కాంట్రాక్టర్ వైఫల్యమా..ప్రజల పాలిటి మరణ శాసనమా..



పాకాల, జూన్ 25, ప్రభాతవార్త : పాకాల మండలం మద్యనాయుదు పల్లికి వెళ్లే దారిలో వెంకట రామాపురం సబ్ స్టేషన్ ఆనుకుని ఓబులు శెట్టివారిపల్లి వరకు మూడు ఫేసుల లైన్ కొరకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ స్తంభంకు సపోర్టు ఉంచిన పోల్స్ క్లంపులు బిగించకుండా వదిలేసిన కాంట్రాక్టర్ ఇది కాంట్రాక్టర్ వైఫల్యమా.. లేక విద్యుత్ ఉన్నతాధికారులు నిర్లక్ష్యమా అని వాహనదారులు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు దీనికి బాధ్యత వహించాలని స్థానిక గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇదివరకే సపోర్ట్ పోలు రోడ్డుపైన పడిపోవడంతో వాహనదారులకి తృటిలో ప్రమాదం తప్పింది. ఇకనైనా సంబంధిత విద్యుత్ అధికారులు దీనిపై చర్యలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా చూడాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు కెవి వెంకట్రాది నాయుడు అన్నారు.

## గోతుల పడ్డ రోడ్డు...తప్పని వాహనదారుల పాట్లు

### కనీసం మరమ్మాతులైన చేయండి చాలు



పాకాల, జూన్ 27 ప్రభాతవార్త : పాకాల డామలచెరువుకు రోడ్డులో ఊట్లవారిపల్లి గ్రామం నుంచి రైల్వే గేటు వరకు గత కొంత కాలంగా రోడ్డుపై భారీగా గోతులు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం పడినప్పుడల్లా గోతులలో నీళ్ల నిలబడి వాహనదారులకు గోతులు ఎక్కుడున్నాయో తెలియక ద్విచక్ర వాహనాలు ఆటోలు తరచూ ప్రమాదా నికి గురవుతు న్నాయి. అంతే కాకుండా త్వరలో జరిగే ఆడికృత్తిక పండుగ జరుగుతూ ఉండటం ఆ లోపల పరిస్థితులు చక్కబడుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. ఈ అధ్వాప పరిస్థితికి నుంచి అధికారులు వెంటనే స్పందించి గోతులు పూడ్చి సమస్యలు పరిష్కరించాల్సిందిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కెవి వెంకటాద్రి నాయుడు కోరుచున్నారు.

## మార్కెట్ ముందర గుంతలు...పట్టించుకోని అధికారులు

పాకాల, జూన్ 27 ప్రభాతవార్త : పాకాల మెయిన్ రోడ్డు అనుకొని ఉన్న కూరగాయలు మార్కెట్, డ్రైనేజీ మరమ్మత్తుల కొరకు గత పది రోజులు ముందు గొయ్యి తీసి వదిలేసారు. దీంతో మార్కెట్‌కు వచ్చే వారి స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై వెంటనే ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి గుంతను పూడ్చి వేయవల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

## రాష్ట్ర స్థాయి ర్యాంకులతో ఎంజిఎం విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో పట్టణంలోని ఎంజిఎం జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకుల సాధించారు. ఈసందర్భంగా ఎంజిఎం కళాశాల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో ఎంపిసి విభాగంలో కుమారి ఎం.బేబిశ్రీ (467/470), ఎస్.మానస(464/470), సాయి ప్రణవి(464/470), బి.సౌమ్య శ్రీచందన (464/470) మార్కులు సాధించారు. బైపిసి విభాగంలో బిందుమాధవి (433/ 440) మార్కులు సాధించి శ్రీకాళహస్తి పట్టణంలో ప్రథమస్థానంలో సాదించి కె.నవీన(431/440), ఎం.పూజిత(427/440) మార్కులు సాధించారు. అలాగే గతంలో కూడా శ్రీకాళహస్తిలో పలుమార్లు ప్రథమస్థానంలో నిలచిందని అలాగే ఎంసెట్‌లో ఎంపిసి విభాగంలో ఏ.వినయ్ 1059వ ర్యాంకు, ఎస్.భార్గవి 18943, ర్యాంకులు సాధించాని, బైపిసి విభాగంలో డి.మునిచిత్ర 3824 , 8503వ ర్యాంకు సాధించారని తెలిపారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను కళాశాలలో ప్రాంగణంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వివిఎస్.రత్నం, మహదేవన్ కళాశాల అధ్యాపకులు తల్లిదండ్రులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అన్ని విధాల ప్రోత్సాహించాలి : ఎమ్మెల్యే



తిరుపతి కార్పొరేషన్, జూన్ 27 ప్రభాతవార్త : మానసిక, శారీరక, వికలాంగులను అన్ని విధాల ప్రోత్సాహించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. హెలెన్ కెల్లర్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన చెప్పారు. వికలాంగురాలైన హెలెన్ కెల్లర్ తన విశేష ప్రతిభతో నోబుల్ పురస్కారాన్ని పొంది తన ఖ్యాతిని ప్రపంచానికి చాటిందని ఆయన చెప్పారు. జీవకోనలోని విశ్వం స్కూల్‌లో హెలెన్ కెల్లర్ జయంతిని స్వచ్ఛంద సంస్థ దీన జన సేవా సమితి నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దీన జన సేవా సమితి ఏర్పాటు చేసిన బెడ్స్, ఫ్యాన్స్ వికలాంగులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగం ఎంత అభివృద్ధి చెందినా కొన్ని వ్యాదులకు ఇంకా మెరుగైన వైద్యం అందుబాటులోకి రావాల్సి ఉందని అన్నారు. సెర్రిబ్రల్ పాలసికి గురైన పిల్లలతో పాటు వృద్ధులకు సానుభూతితో చూడాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. మానసిక విలాంగులను ఆదుకుంటున్న సంస్థలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన తిరుపతి పరిశీలకులు వెంకటేశ్వర రావు, టిడిపి కార్పొరేటర్ అన్నా సంధ్య, ఇస్కాన్ కార్యదర్శి లీలా పారాయణ ప్రభూజీ, విశ్వం స్కూల్స్ అధినేత విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత గ్లకోమా వైద్య శిబిరం



తిరుపతి హెల్త్, జూన్ 27 ప్రభాతవార్త : తిరుపతిలోని తిలక్ రోడ్‌లోని శ్రీ సాయి సుధా కంటి ఆసుపత్రిలో సుధారాణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత గ్లకోమా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరం నందు సుమారు 50 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ మధుమేహం ఉన్న వారిలో గ్లకోమా అనే నీటి కాసుల వ్యాధి వస్తుంది. ఇలాంటప్పుడు రక్తంలో చెక్కర స్థాయిలు రెటీనాలోని రక్తనాళాలను దెబ్బతీస్తాయి. రెటీనా అనేది కంటి లోపల భాగంలో కాంతి సెన్సిటివ్ భాగం, డయాబెటిక్ రెటీనోపతి యొక్క ప్రారంభ దశలో దృష్టి సాధారణంగా ప్రభావితం కాదు రెటీనోపతి అభివృద్ధి చెందుతున్నప్పుడు దృష్టి ప్రభావితం కావచ్చు. పరిస్థితిని చాలా కాలం పాటు నిర్లక్ష్యం చేస్తే పూర్తిగా దృష్టిని కోల్పోయే ప్రమాదం ఉంది. డయాబెటిక్ ఉన్నవారు ప్రతి 3 నెలలకు ఒకసారి తప్పనిసరిగా గ్లకోమా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నట్లయితే, గ్లకోమా బారిన పడకుండా, కంటి చూపు కోల్పోకుండా కాపాడుకోవచ్చని ఆమె తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో హాస్పటల్ సిబ్బంది హిమ బిందు, చిట్టెమ్మ, మహేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

## కుంట్రపాకంలో గంగజాతర

### పట్టు వస్త్రాలు సమర్పించిన సుధారెడ్డి



తిరుపతిరూరల్, జూన్ 27 ప్రభాతవార్త: తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం గ్రామ పంచాయ తిలో గురువారం గంగ జాతరను ఘనంగా నిర్వహించారు. కొలువుదీరిన గంగమ్మకు చంద్రగిరి ఎమ్మెల్యే సతీమణి పులివర్తి సుధారెడ్డి పట్టు వస్త్రాలు అందజేసారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం : ఎంఎల్ఏ



చంద్రగిరి, జూన్ 27 ప్రభాతవార్త: రైతు సంక్షేమమే ముఖమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. గురువారం గంగిరెడ్డిపల్లి రైతు భరోసా కేంద్రంలో సబ్సీడీ వేరుశెనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాయలచెరువు సమస్య పరిష్కా రానికి ముఖ్యమంత్రితో చర్చించానన్నారు. ఎగువ, దిగువ ప్రాంతాల రైతులకు తగిన న్యాయం చేస్తామన్నారు. రాయలచెరువు మిగుల జలాలను మండలంలోని చెరువులకు అనుసంధానం చేయడంతో పాటు చంద్రగిరి మండలానికి తరలించేందుకు ప్రతిపాధనలు సిద్దం చేస్తామన్నారు. పార్టీలకతీతంగా రైతులకందరికీ విత్తనాలను అందించాలని అధికారులను ఆదేశించారు. వేరుశెనగ పంటపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. చిగురువాడ నుండి రాయలచెరువు కట్ట వరకు ఫోర్ లైన్ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, నాయకులు జనార్ధన్ చౌదరి, నరశింహారెడ్డి, రావిళ్ళ గిరి, కోరా హరిప్రసాద్, సురేంద్ర నాయుడు, బాబు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## మాతమ్మకు పులివర్తి వారి సారె



రామచంద్రాపురం, జూన్ 27 ప్రభాతవార్త: గణేశ్వరపురం ఆది ఆంధ్రవాడలో జరుగుతున్న మాతమ్మ ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ఎంఎల్ఏ పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి సారె సమర్పించారు. ఇందులో భాగంగా ఆమెకు గ్రామ పెద్దలు ఆమెకు మేళతాళాలు మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో పూజారికి సారెను సమ ర్పించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బొల్లినేని వసంతకుమార్, మురళి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలందరూ బడిలోనే వుండాలి : ఎంఈఓ



చంద్రగిరి, జూన్ 27 ప్రభాతవార్త: బడి ఈడు పిల్లలందరూ బడిలోనే వుండాలని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఎంఈఓ-2 భాస్కర్ బాబు అన్నారు. మండల పరిధిలోని చిన్నరామాపురం, కూచివారిపల్లి, బూడిదగట్టుపల్లి, మూలపల్లి గ్రామాలలో గురువారం నేను బడికి పోతా కార్యక్రమాని న్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చిన్నారులను బడి బయట లేకుండా బడిలో వుండే విధంగా చూడాలన్నారు. చదువుతోనే మంచి జీవితం లభిస్తుందనే విషయాన్ని తల్లిదండ్రులకు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. బడిలో చేరిన పిల్లలకు స్టూడెంట్ కిట్‌తో పాటు ఇతర విద్యా ప్రోత్సాహకాలను అందించడం జరుగుతుందన్నారు. బడి ఈడు పిల్లలు బడి బయట లేని గ్రామాలుగా ప్రకటించడమే నేను బడికి పోతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మదన్‌మోహన్, టీచర్లు ప్రభాకర్ రావు, పీరయ్య, శైలజ, రాజేంద్రబాబు, ధనంజయ, శ్రీరాములు, చెంచయ్య, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ భరద్వాజ, సి.ఆర్.పి రమేష్, నాయకులు మునిచంద్ర, సురేంద్రలు పాల్గొన్నారు.

## రాస్ కృషి విజ్ఞాన కేంద్రానికి ప్రతిష్టాత్మక ప్రశంసాపత్రాలు




రేణిగుంట, జూన్ 27 ప్రభాతవార్త: రేణిగుంట మండలం, కరకంబాడి పంచా యతీ, చైతన్య పురంలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రానికి 2023-24 సంవత్సరానికి 4 అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రశంసాపత్రాలు లభించాయి. జూన్ 25 నుండి 27 వరకు రాజమండ్రిలో జరిగిన జోనల్ 10 కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్ సమావేశంలో హైదరాబాద్‌కు చెందిన భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ సంచాలకులు మాధుర్, ఐసిఏఆర్ అటారీ జోన్ 10 డైరెక్టర్ మీరా చేతులమీదుగా రాస్ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ శ్రీనివాసులు ప్రశంసాపత్రాలను అందుకున్నారు. భూసారం, సేంద్రీయ ఎరువుల తయారీ, వానపాములను ఎలా ఉపయోగించుకోవాలి, ఎలాంటి విత్తనాలను వినియోగించడం ద్వారా రైతులకు మంచి ఉత్పత్తులతో పాటు లాభాలు వస్తాయో ప్రయోగాత్మకంగా నిరూపించినందుకు ఈ ప్రశంసాపత్రాలు అందుకున్నామని డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలకు సంబంధించి అవార్డులు రావడం సంతోషంగా వుందనీ రాస్ జనరల్ సెక్రటరీ ఎస్.వెంకటరత్నం కృషి విజ్ఞాన శాస్త్రవేత్తలను, సిబ్బందిని అభినందించారు.

## కోర్టును ఆశ్రయించిన మున్సిపల్ ఖాళీ స్థలం లీజుదారులు

శ్రీకాళహస్తి జూన్ 27 ప్రభావార్త : శ్రీకాళహస్తి మున్సిపాలిటికి సంబంధించిన ఖాళీ స్థలాన్ని 3 సంవత్సరాలకు ముగ్గురు లీజుకు తీసుకొని ఆ స్థలంలో తమ బతుకు జీవనం కోసం షాపులు నిర్మించుకుంటుంటే వాటిని ఎలాంటి సమాచారం నోటీసుల్లేకుండా తొలగించుటకు మున్సిపాలిటి ప్రయత్నిస్తుందని తమకు రక్షణ కల్పించమని బాధితులు రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం అందింది.బాధితుల తరపున న్యాయవాది జి.రమేష్‌బాబు పిటిషన్‌ను నెంబర్ 12609 ఆఫ్ 2024 దాఖలు చేసినట్లు సమాచారం. శ్రీకాళహస్తి మున్సిపాలిటికి సంబంధించిన సర్వేనెంబర్ 245లో ముగ్గురు యువకులు ఫరీద్,షేక్ రఫీ,ఎస్ సర్దార్ అనే యువకులు ఖాళీ స్థలం లీజుకు తీసుకొనుటకు టెండర్లలో పాల్గొన్నారు.వారి వాదన మేరకు 2024 జనవరి 31న ముగ్గురు యువకులు మున్సిపాలిటిలో మూడేళ్ళకు అనగా01.02.2024 నుంచి 31.01.2027 వరకు లీజుకు తీసుకున్నారు.ఈ మేరకు మున్సిపాలిటి ఎస్ నెంబర్ 2317/ 2023/ఏ1 మేరకు అనుమతించటంతో యువకులు అక్కడ 12కి10 కొలతతో షాపింగ్ రూంలు నిర్మించుకుంటున్నట్లు హైకోర్టుకు విన్నవించారు.కాగా ఈమేరకు మున్సిపాలిటి 30.05.2024న అగ్రిమెంట్ కూడా చేసిందని పేర్కొన్నారు. ఈమేరకు శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్, తిరుపతి జిల్లా కలెక్టర్,రాష్ట్ర మున్సిపల్ డైరెక్టర్లను పార్టీలుగా పొందుపరచారు.ఈ పిటిషన్‌పై హైకోర్టు మళ్ళీ ఉత్తర్వులు జారి అయ్యేవరకు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సూచించినట్లు తెలిసింది.

## రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో శ్రీకాళహస్తి, తొట్టంబేడు కార్యదర్శికులకు చోటు



తొట్టంబేడు, జూన్ 27 ప్రభాతవార్త: తొట్టంబేడు మండలం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి ఎన్నికలు అమరావతిలోని అసోసియేషన్ భవనంలో ఎన్నికలు నఇర్వహించారు. రాష్ట్ర స్థాయి ట్రెజరర్‌గా శ్రీకాళహస్తి డివిజనల్ పంచాయతీ అధికారి బి.ప్రభురెడ్డి మరియు ఉమ్మడి రాయలసీమ జోనల్ జిల్లాలకు కార్యదర్శిగా కందుకూరి ఆనందబాబులను ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈసందర్భంగా ప్రభురెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు తీర్చేదానికి కృషిచేస్తామని తెలిపారు. సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి రాయలసీమ కార్యదర్శి కందుకూరి ఆనందబాబు మాట్లాడుతూ పంచాయతీరాజ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు సమస్యలపైన ప్రభుత్వంతో మాట్లాడుతామని కార్యదర్శులకు ఆరు గ్రేడ్‌లు ఉన్నాయని వీటిపి మూడు గ్రేడ్‌లుగా కుదించాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఈసందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

## సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో విస్తృత ప్రచారం



తొట్టంబేడు, జూన్ 27 ప్రభాతవార్త : సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో విస్తృతంగా వైద్యాదికారులు ప్రచారం నిర్వహిస్తున్నారు. కాసారం పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ శివకుమార్, డాక్టర్ మాద యుడు గుండేలిగుంట, కాసరంలోని పాఠశాలలను సందర్శించి పాఠశాలకు నీటి వనరులన్నింటిని పరిశీలించి దృవీకరించారు. మరియు ప్రజలకు మరియు పాఠశాల ఉపాధ్యాయులకు మరియు పిల్లలకు వాంతులు మరియు విరేచనాలు వంటివి నీటి కాలుష్యం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి వివరించారు. గ్రామ ఆరోగ్య క్లీనిక్‌లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను జింక్ మాత్రలను మరియు స్పోరాలాక్ ప్యాకెట్‌ల గురించి ఎఎన్ఎం మరియు ఎంఎల్‌హెచ్‌పిలకు సూచనలందించారు. అదేవిధంగా డయేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరు గ్రామాల్లో కాచి చల్లార్చిన నీరు తాగాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో రాయలసీమ విద్యార్థుల ప్రతిభ



శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త : ఇంటర్ మొదటి సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితఆల్లో ఎంపిసి గ్రూపులో 470 మార్కులకు 460పైన మార్కులు సాధించిన రాయలసీమ జూనియర్ కళాశాల విద్యార్థులు పి.గగన (463), షేక్ అమీరున్(462), పి.జాహ్నవి (462), ఖాజీమహమ్మద్ సాహిద్ (461), బి.శ్రీను (461) మరియు బైపిసి గ్రూపు నందు 440 మార్కులకు గాను యు. గీతిక (430), కె.దీపక్ (415), జి.పద్మశ్రీ (415) మరియు సిఈసి గ్రూపు నందు 500 మార్కులకు గాను 470 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులు ముగ్గురు జి.నాగేశ్వరి(476), ఐ.మునిరెడ్డమ్మ(471), ఎం.దీక్షిత(470)పైగా మార్కులు సాధించిన ప్రతి విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులను కళాశాల డైరెక్టర్ కాయం సుబ్బరామిరెడ్డి, ప్రిన్సిపల్ జయభారత్‌రెడ్డి మరియు అధ్యాపక బృందం తదితరులు అభినందనలు తెలిపారు.

## ముఖ్యమంత్రికి ఎపిసిపిఎస్ఈఎ సంఘ నాయకులు



శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు ఏపిసిపిఎస్ఈఏ తిరుపతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఆర్.దేవా నంద్, ప్రధాన కార్యదర్శి పి.వెంకట సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మరియు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టి.శ్రీనాథ్, శ్రీకాళహస్తి అధ్యక్షులు వి.గంగయ్య, తరపున సిపిస్ మరియు జిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని కోరగా సిఎం సానుకూలంగా స్పందించారని సంఘ నాయకులు తెలిపారు.

## వృద్ధులకు రొట్టెలు పండ్లు పంపిణీ

శ్రీకాళహస్తి, జూన్ 27 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి విద్యాశాఖ కార్యాలయంలో ఎంతో కాలంగా పనిచేస్తూ అందరికి సుపరిచస్తుడైన కెవి.ప్రశాంత్ పుట్టినరోజు సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా భరద్వాజతీర్థంలో ఉన్న వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు రొట్టెలు, పండ్లు, బిస్కట్లు పంపిణీచేశారు. ఈసందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ వృద్ధులకు తన వంతు సాయం చేయడం ఎంతో అదృష్టమన్నారు. ప్రతి ఒక్కరు పుట్టినరోజు సందర్భంగా వేడుకలు చేసుకోకుండా నిరుపేదలకు అన్నదానం, వృద్ధులకు పండ్లు పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు.

## భూకబ్జాలు, గ్రావెల్ అక్రమ రవాణాలపై విచారణ చేయిస్తా : గాలి భానుప్రకాశ్



పుత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త : పుత్తూరులో జరిగిన భూకబ్జాలు, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా, మద్యం అక్రమాలపై త్వరలోనే విచారణ చేయిస్తానని నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అధికారులు కూడా తప్పులు చేస్తే సస్పెన్షన్ సంగతి అలా వుంచి క్రిమినల్ కేసులు పెడతానని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. నాటకాలాడితే ఎవరినీ ఉపేక్షించనన్నారు. గురువారం మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అధికారులు ప్రజల కోసం బాధ్యతా యుతంగా పనిచేయాలని సూచించారు. తాను గత ఎమ్మెల్యే రోజా కాదని, భానుప్రకాశ్ అనే విషయాన్ని అందరూ గుర్తు పెట్టుకోవాలని స్పష్టీకరించారు. పుత్తూరు మునిసిపాలిటీలో ప్రతి వార్డులోనూ సమస్యలున్నందు వల్లే నగరి నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో ఒక్క పుత్తూరులోనే తనకు అత్యధిక మెజార్టీ వచ్చిందని గుర్తు చేశారు. ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని, వారి ఆకాంక్షల మేరకు పనిచేస్తానని తెలిపారు. పుత్తూరును ఒక మోడల్ మునిసిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. వైసిపికి చెందిన మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాశ్ (చిట్టి), కౌన్సిలర్ వనితలు మాట్లాడుతూ మాజీ మంత్రి రోజా పుత్తూరు మునిసిపాలిటీ అభివృద్ధికి విశేష కృషి చేశారని, కోట్లాది రూపాయలతో పుత్తూరులో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. కొత్త ప్రభుత్వంలో గెలిచిన ఎమ్మెల్యే భానుప్రకాశ్ కూడా పుత్తూరు అభివృద్ధికి పాటుపడాలని దానికి తమ సహకారం వుంటుందని తెలిపారు. వైసిపికి చెందిన 13వ వార్డు కౌన్సిలర్ బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ అభివృద్ధి పనుల కేటాయింపులో మునిసిపాలిటీలో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉదయం తొమ్మిది గంటల లోపు పట్టణంలో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందని అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదని తెలిపారు. టిడిపికి చెందిన 22వ వార్డు కౌన్సిలర్ గాలి జీవరత్నంనాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో గత మూడేళ్లలో మునిసిపల్ కౌన్సిలర్లకు విలువ లేదని, ప్రభుత్వ పెద్దల అండతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని తెలిపారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలో వున్నప్పుడు పుత్తూరు మునిసిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనులు తప్ప, గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏ మాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ డి.శంకర్, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

### గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్



గూడూరు, జూన్ 27 ప్రభాతవార్త: గురుకుల పాఠశాల, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్యం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అధికారులను ఆదేశించారు. గూడూరు గ్రేడ్ వన్ పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాల ప్రభుత్వ పాఠశాలలను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ గురువారం పరిశీలించారు. కొద్ది రోజుల క్రితం చెన్నూరు గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలలో చదువు తున్న పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైయ్యారు. జిల్లా జాయింట్ కలెక్టర్, విద్యా శాఖ అధికారులు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు పాఠశాలకు వెళ్లి పరిస్థితులను పరిశీలించారు. కలుషిత మంచినీటి సరఫరా కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురి అయినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ తరుణంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పాఠశాలను తనిఖీ చేసి అక్కడ ఉన్న వసతులను స్థానిక అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ విద్యా సంస్థలలో మెరుగైన వసతులు ఏర్పాటు చేయాలని విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశిస్తున్నామన్నారు. ఈయన వెంట స్థానిక నాయకులు అల్లూరు కరుణాకర్ రెడ్డి, యల్లసిరి శ్రీనివాసులు రెడ్డి, శ్రీకిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మట్టం శ్రావణి, మట్టం మురళి, తదితరులు పాల్గొన్నారు.

# తిట్టిన నోళ్లతోనే పొగడ్తలు...సన్మానాలు

### ఎమ్మెల్యే భాను కరుణకు వైసిపి నాయకులు, అధికారులు

పుత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త : అధికారానికి నాయకులు, అధికారులు దాసోహమైపోతారనడానికి పుత్తూరు కౌన్సిల్ సమావేశం ఒక నిదర్శనం. గత మూడేళ్లుగా మునిసిపల్ కౌన్సిల్ సమావేశాల్లో ఎవరినైతే విమర్శించి... తిట్టారో అదే వ్యక్తి పట్ల గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో భక్తి, ప్రపత్తులతో నడుచుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో నగరి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 45,004 ఓట్ల అత్యధిక మెజార్టీతో తెలుగుదేశం పార్టీ తరపున గాలి భానుప్రకాశ్ ఎమ్మెల్యేగా గెలిచిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే హోదాలో తొలిసారి ఆయన మునిసిపల్ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. కౌన్సిల్లో మొత్తం 27గురు కౌన్సిలర్లలలో టిడిపికి 5 గురు కౌన్సిలర్లు మాత్రమే వున్నారు. మిగిలిన వారంతా వైసిపి తరపున గెలిచారు. దాంతో గత మూడేళ్లలో జరిగిన ప్రతి కౌన్సిల్ సమావేశంలోనూ అవకాశం దొరికినపుడల్లా ప్రతిపక్షంలో వున్న గాలి భానుప్రకాశ్‌పై ఛైర్మన్‌తో కొందరు కౌన్సిలర్లు విరుచుకుపడేవారు. సమావేశాల్లో ప్రజా సమస్యలపై చర్చలు మానేసి...బయట జరిగిన రాజకీయ అంశాలకు సంబంధించి భానుప్రకాశ్‌ను వ్యక్తిగతంగా తిట్టేవారు. ఒకొక్కసారి ఆయన కుటుంబ సభ్యులను కూడా విమర్శల్లోకి లాగేవారు. ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్సీ దివంగత గాలి ముద్దుకృష్ణమనాయుడును కూడా వదిలిపెట్టలేదు. ముద్దుకృష్ణమనాయుడు చనిపోయి ఏళ్ల



భానుకు పుష్పగుచ్ఛాలు అందిస్తున్న వైసిపికి చెందిన ఛైర్మన్, కౌన్సిలర్లు

గడుస్తున్నా ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన పుత్తూరు అభివృద్ధికి ఆయన ఏమీ చేయలేదని, రెండు సార్లు గెలిచిన తమ ఎమ్మెల్యే ఆర్.కె.రోజా హయాంలోనే పుత్తూరు అభివృద్ధి చెందిందని గట్టిగా అరిచి మరీ చెప్పేవారు. ప్రతిపక్ష టిడిపి కౌన్సిలర్ గాలి జీవరత్నంనాయుడు ఏదైనా సమస్యను లేవనెత్తితే...అసలు మునిసిపాలిటీలో సమస్యలే లేవని, అలాంటపుడు ఎందుకు మాట్లాడతావని నలుగురైదుగురు వైసిపి కౌన్సిలర్లు ఒకేసారి మీద పడేవారు. కమిషనర్‌తో సహ అధికారులు సరిగా సమాధానం చెప్పేవారు కాదు. ఈ నేపథ్యంలో గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పూర్తి భిన్నమైన వాతావరణం కనిపించింది. టిడిపి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాలు ఇచ్చేందుకు వైసిపి కౌన్సిలర్లు పోటీ పడ్డారు. ఒకరి తర్వాత మరొకరు తోసుకుని మరీ...దగ్గరకు వెళ్లి కరచాలనాలు చేశారు. అధికారులైతే అట్టహాసంగా సభ నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. పుత్తూరు అభివృద్ధితో తామంతా సహకరిస్తామని వైసిపి కౌన్సిలర్లంతా టిడిపి ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. కనీస సౌకర్యాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాల్లో కౌన్సిల్లో గత మూడేళ్లలో అర్థవంతంగా ఒక్కసారి కూడా చర్చలు జరగలేదు. ఎప్పుడూ రాజకీయాలు, తమ నాయకుల భజన, ప్రతిపక్ష నాయకులపై విమర్శలకే అధిక శాతం సమయం వెచ్చించారు. వచ్చే రెండేళ్లయినా కౌన్సిల్ సమావేశాల వల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందో లేదో వేచి చూడాలి.

# పిల్లల ఆరోగ్యమే మహాభాగ్యం

### పాఠశాలలో చేతులు శుభ్రం చేసే కార్యక్రమంను ప్రారంభించిన ఎమ్మెల్యే

చిత్తూరు, జూన్ 27 ప్రభాతవార్త: పిల్లలు ఆరోగ్యంగా వుంటేనే ఆరోగ్య సమాజం ఆవిష్కృతం అవుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2024 కార్యక్రమంలో భాగంగా గురువారం గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు చేతులు శుభ్రపరచడంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గురజాలజగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డయేరియా, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం వుండటంతో ప్రజలు అప్రమత్తంగా వుండి జాగ్రత్తలు తీసుకుని వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో డయేరియా, మలేరియా వ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని





వివరించారు. అన్ని డివిజన్లలో డయేరియా నియంత్రణ చర్యలు జరుగుతున్నాయన్నారు. వ్యాధులు రాకుండా విద్యార్థులు ప్రతిరోజు భోజనానికి ముందు, తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో హ్యాండ్ వాష్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చేతులను పూర్తి స్థాయిలో శుభ్రం చేసుకోవడం ఎలా! అనే విషయాలపై ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ స్వయంగా చేసి చూపించారు. చేతులను శుభ్రపరిచే ఆరు ప్రక్రియలను ఎమ్మెల్యే, కమీషనర్, ఇతర అధికారులు, విద్యార్థులతో కలిసి చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, ఎంఇఓలు సెల్వరాజ్, మోహన్, హెడ్మాస్టర్ రమేష్‌బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధే మాప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

దొరవారిసత్రం జూన్ 27 ప్రభాతవార్త ; రాష్ట్రంలో రైతులను అన్నివిధాల అభివృద్ధే చేయడమే మాప్రభుత్వ లక్ష్యమని సూళ్ళూరుపేట శాసన సభ్యు లు నెలవల విజయశ్రీ అన్నారు. దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో నియోజక వర్గంలోని సూళ్ళూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల రైతులకు నిర్వహించిన పచ్చిరొట్టి విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు.



ఈసందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లడుతూ ప్రభుత్వం రైతులకు 50శాతం సబ్సీడిపై 1726 కింటాలు పచ్చిరొట్టి విత్తనాలు అందించడం జరుగుతుందన్నారు.అంతే కాకుండ మట్టినమూనా సేకరణ,1580 కౌలురైతులకు అర్హత పత్రాలు,పియం కిసాన్ అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం రాయితీపై రైతులకు అందిస్తున్న పథకాలను సిద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా రైతులకు పచ్చిరొట్టి విత్తనాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎడి అనిత,ఎవొలు జ్యోతి, కవిత, కాంచన, ఎంపిపి దువ్వూరు సుజాతమ్మ,గోపాల్‌రెడ్డి,తెదేపా మండలపార్టీ అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, మాజీ ఎంపిటిసి బందిల ఉదయ్‌కుమార్,గొను జకరయ్య,శీనయ్య,తెదేపా నాయకులు,కార్యకర్తలు,రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగం పరిపుష్టికి చర్యలు: ఎంఎల్ఏ



చంద్రగిరి, జూన్ 27 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సొంత నియోజక వర్గం, నారా లోకేష్ సొంత ఇల్లు కలిగిన మండలంలో వ్యవసాయ రంగం పరిపుష్టికి సమర్థవంతమైన చర్యలు తీసుకుంటామని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక నూకలగుంట వద్ద రైతుభరోసా కేంద్రంలో గురువారం ఆయన రైతన్నను దుశ్శాలువతో గౌరవించి, వేరుశెనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రైతే రాజు అన్న నినాదంతో నాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు నాయకత్వంలోని టిడిపి ఘన విజయం సాధించినట్లు గుర్తు చేశారు. రైతుల సంక్షేమం కోసం మా మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా అన్నదాత సుఖీభవ కార్యక్రమం ద్వారా రైతులకు రూ.20 వేలు (రాష్ట్రం వాటా రూ.14 వేలు) జమ చేయడం జరుగుతుందన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా మురుగునీటి కాలువలను శుభ్రం చేయించి, బ్లీచింగ్ చేయాలని అధికారులకు సూచించారు. వార్షాలు కురుస్తున్నందున వర్షపునీరు చెరువులకు చేరేందుకు అనువుగా కాలువలను శుభ్రం చేయాలని సూచించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ఇరిగేషన్ ఈఈ శివారెడ్డి, డిఎఓ పి.ప్రసాదరావు, తహశీల్దార్ మారుతి, ఎంపిడిఓ డాక్టర్ వి.వి.సూర్యసాయి, ఏఓ సి.విజయభాస్కర్, హెచ్ఓ శైలజ, నాయకులు హేమాంబరధర రావు, మొక్కల కుమార్ రాజారెడ్డి, గౌస్‌భాషా, వీరంగారి రమేష్ రెడ్డి, కొండూరు ప్రవీణ్‌రాయల్, సక్కూర్ ధనంజయ రెడ్డి, ముడిపల్లి సురేష్‌రెడ్డి, రాజులగారి వినోద్‌కుమార్ రెడ్డి, శానంబట్ల తులసిరెడ్డి, ఏజి పల్లి బాల, పులికంటి మోహన్ రెడ్డి, దుబాసి రామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి లక్ష విరాళం

కాణిపాకం, జూన్ 27 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవు తున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి భక్తులు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు చిత్తూరు నగరానికి చెందిన ఎన్.రమక్క, నరసింహులు నాయులు దంపతులు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను డీడీ రూపంలో విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాతలు ఆలయ సూపరెండెంట్ కోదండ పాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్‌లకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ మదుసూదన్‌రావు దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.



## చంద్రప్రభ వాహనంపై ఊరేగిన కోదండరాముడు



తవణంపల్లె, జూన్ 27 ప్రభాతవార్త: మండలంలోని టి.పుత్తూరు గ్రామంలో వెలసిన శ్రీకోదండరాముల వారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీసీతా లక్ష్మణ సమేతుడైన కోదండరాముడు చంద్రపభ వాహనంపై గ్రామ పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈకార్యక్రమానికి పామినవాండ్లవూరుకు చెందిన తన్నేరి రామకృష్ణ అండ్ సన్స్ ఉభయదారులుగా వ్యవహరించారు. ఈసందర్బంగా ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం నిర్వహించగా సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. అలాగే రాత్రి ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వుంచి అలంకరించి అర్చకులు ప్రత్యేకపూజలతో ధూపదీప నైవేద్యాలను సమర్పించారు.అనంతరం అలంకరించిన చంద్రప్రభ వాహనంపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సిద్దేశ్వరరెడ్డి, ఉత్సవ ఉభయదారులు, పరిసర గ్రామస్థులు పాల్గొన్నారు.

## జాతీయ ఆర్చరీ పోటీలకు నాగశ్రీ వైభవ్ ఎంపిక

తిరుపతి విద్య, జూన్ 27 ప్రభాతవార్త : స్థానిక తిరుమల బైపాస్ రోడ్డు నందు గల శ్రీ చైతన్య పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న నాగశ్రీ వైభవ రామ్ ఈ నెల జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఏజీఎం సురేష్ తెలిపారు. ఈ నెల విజయవాడలో శాత వాహన డిగ్రీ, జూనియర్ కాలేజీలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 13 బాలుర కేటగిరి ఆర్చరీ పోటీలకు ఎంపిక కావడం గర్వకారణం అని, పాఠశాల ప్రిన్సిపాల్ మెగోమి పేర్కొన్నారు. తమ విద్యార్థి జాతీయ స్థాయిలో ఆర్చరీ పోటీలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కోచ్ టీ. ధనంజయులు మాట్లాడుతూ వరుసగా రెండవసారి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనందుకు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బాలరాజు, ప్రైమరీ ఇన్చార్జి జయశ్రీ, అకడమిక్ డీన్ శివకుమార్, సి బ్యాచ్ ఇన్చార్జి రామ్ తుల్లా, 10 ఇంచార్జ్ కుమారి, లక్ష్మీ నరస్వతి, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.





## నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యం : ఎమ్మెల్యే

వెంకటగిరి, జూన్ 27 ప్రభాతవార్త : వెంకటగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో జల వనరులు, తెలుగు గంగ, పంచాయితీ రాజ్ అధికారులతో నియోజక వర్గంలో జరుగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బంది లేకుండా సోమశిల – స్వర్ణముఖి కాలువ పనులను, రిజర్వాయర్ పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులకు కావాల్సిన నిధులను సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తీసుకొని వస్తానని తెలిపారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై పంచాయితీరాజ్ అధికారులతో సమర్పించారు. గత ప్రభుత్వాలు ఏమన్నా పనులు జరుగుతున్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యమని తెలిపారు. ప్రజలు తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయనని తెలిపారు. ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. ఈ సమావేశంలో ఇంజనీర్లు రాధాకృష్ణమూర్తి బాబు రెడ్డి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



## రెవెన్యూ సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలి

### - జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ - నిజాయితీ..అంకితభావంతో పనిచేసి మంచి పేరు తేవాలి !!- భూసర్వే.. ఆక్రమణలపై ప్రతి ఇంటా స్పెషల్ డ్రైవ్ !!



కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త : రెవెన్యూ సమస్యల పరిష్కారం పట్ల అధికారులు శ్రద్ధపెట్టి కష్టపడి పని చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక మండల కార్యాలయం లో నియోజకవర్గంలోని తహశీల్దార్లు, డిటిలు, ఆర్ఐలు, విఆర్వోలు, సర్వేయర్లు, కుప్పం ఎంపిడిఓతో జాయి ంట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికార యంత్రాంగం నిజాయితీ, అంకితభావంతో పనిచేయాలని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ జిల్లా యంత్రాంగానికి మంచి పేరు తేవాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనలో భాగంగా ప్రజలనుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అధికారులు అలసత్వం వీడి పనిచేయాలన్నారు. సిఎం పర్యటనలో వచ్చిన అర్జీలు ఆర్డీఓకు, ఆ తర్వాత సంబంధిత మండలాలకు పంపించడం జరుగుతుందన్నారు. వీటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. వీటితో పాటు కుప్పం నియోజకవర్గంలో రెవెన్యూ సంబంధమైన భూ సర్వే, భూఆక్రమణలు, పాస్‌పుస్తకాల మ్యుటేషన్లు తదితర అంశాలకు సంబంధించి ప్రతి సచివాలయం పరిధిలో ఒక విఆర్వో, ఒక విలేజ్ సర్వేయర్ బృందంగా ఏర్పడి ఆయా సచివాలయాల్లోని ప్రతి గడపకు వెళ్లి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రైతులనుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించి నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. జూలై 15లోగా అధికారు తమ పరిధిలో పరిష్కరించగల వినతులు, సమస్యలు పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో ఇబ్బందులు కలిగితే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. ధృవపత్రాల పంపిణీకి సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని ఆమోదించి మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, సర్వే ఎడి గౌస్ బాషా, తహశీల్దార్లు పాల్గొన్నారు.

**ప్రభుత్వ కాలేజీలు..స్కూళ్లు..హాస్టళ్లపై నివేదిక ఇవ్వాలి :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లలో గల మౌలిక వసతుల కల్పనపై జూలై 7వతేది లోగా పూర్తి నివేదిన సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం కుప్పం ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులుతో కలసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కెజిబివి రెసిడెన్షియల్ స్కూళ్లు, ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ హాస్టళ్లలో అవసరమైన వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే ప్రతి పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల వివరాలు సేకరించాలన్నారు. జిల్లాలో అక్రమ మైనింగ్ కట్టడికి చర్యలు చేపట్టాలన్నారు. అనుమతులు ఉన్న, అనుమతులు లేని మైనింగ్ లవివరాలు మండలాల వారీగా బృందాలను ఏర్పాటుచేసి నివేదిక అందించాలని మైనింగ్ డిడి ఎల్వీ ప్రసాద్‌ను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో మైనర్ మినరల్స్‌లో 665లీజులకు అనుమతి ఇచ్చినట్లు డిడి తెలిపారు. సమావేశంలో డిఆర్వో పుల్లయ్య, డ్వామా పిడి రాజశేఖర్, ఎస్ఎస్ఏ పిసి వెంకటరమణారెడ్డి, డిడిలు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నంపాల్గొన్నారు.

## దోష నివారణ పూజలు జరిపించుకున్న ధూళిపాళ



శ్రీకాళహస్తి జూన్ 27 ప్రభావార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమాన్విత రాహుకేతు దోష నివారణ పూజలను గురువారం గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకర్గం శాసనసభ్యుడు ధూళిపాళ నరేంద్ర కుటుంబసభ్యులతో జరిపించుకున్నారు. కొత్తగా శాసనసభ్యుడుగా గెలిచిన నరేంద్ర కుటుంబ సభ్యులతో శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా పిఆర్ఓ రవి వారికి ప్రత్యేకంగా సహస్రలింగేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసారు. వేదపండితులు ప్రభాకర్ శర్మ రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించారు.వారికి స్వామి అమ్మవార్ల ఆలయం వద్ద అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయ ఆలయం వద్ద వారికి వేదపండితులు అర్ధగిరి స్వామి,ప్రభాకర్ శర్మలు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు,ఆశీర్వచనాలు అందించారు.ఏర్పాట్లను పిఆర్ఓ రవి పర్యవేక్షించారు.

## 'వార్త' ప్రభావం,,,పశు నీటితొట్టెలు శుభ్రం

పాలసముద్రం, జూన్ 27 ప్రభాతవార్త: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ఖర్చు చేసి పశువులకు తాగునీరు అందించడానికి నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా వున్న విషయం 'ప్రభాతవార్త'లో ప్రచురితమైన విషయంపై మండల పరిషత్ అధికారి రామనాథరెడ్డి స్పందించారు. సత్వరం పశునీటి తొట్టెలను శుభ్రం చేసి పశువులు నీరు తాగే విధంగా సిద్ధం చేయాలని గ్రామ కార్యదర్శి సత్యనారాయణను ఆదేశించడంతో ఈ మేరకు కార్యదర్శి గురువారం వనదుర్గాపురం గ్రామంలోని పశు నీటి తొట్టెలను శుభ్రం చేశారు. పశువులు నీరు తాగడానికి నిర్మించిన నీటి తొట్టెలు మళ్ళీ వినియోగంలోకి రావడంతో స్థానిక రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మండల పరిధిలో నిర్మించిన అన్ని పశు నీళ్ళ తొట్టెలను శుభ్రం చేసి వాటిని పశువుల కోసం వినియోగంలోకి తీసుకురావాలని పాడి రైతులు కోరుతున్నారు.

## సమ్మె విరమించిన ద్రవిడ తాత్కాలిక ఉద్యోగులు

### - ఎమ్మెల్సీ డా॥ కంచర్ల హామీతో విధుల్లోకి !!



కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త : గత పదకొండు నెలలుగా వేతనాలు లేకపోవడంతో రెండు నెలల కాలంగా ద్రవిడ వర్సిటీలో సమ్మె చేస్తున్న తాత్కాలిక ఉద్యోగులు ఎట్టకేలకు సమ్మె విరమించారు. గురువారం ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ వర్సిటీలో సమ్మెలో ఉన్న తాత్కాలిక ఉద్యోగులతో చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తాత్కాలిక ఉద్యోగులకు వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటారని, అలాగే వర్సిటీని ప్రక్షాళన చేసి అభివృద్ధి చేస్తారని పేర్కొన్నారు. వర్సిటీ అభివృద్ధికి కమిటీ సైతం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు విధుల్లో చేరాలని సూచించడంతో వారు సమ్మతించారు. ఈసందర్బంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు థ్యాంకూ సిఎం సార్ అంటూ నినాదాలు చేశారు. అలాగే తమ సమస్యల పరిష్కారంకు చొరవ చూపిన ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, దేశం నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం నుంచి తాము విధులకు హాజరవుతున్నట్లు తాత్కాలిక ఉద్యోగులు తెలిపారు.

## గురుదక్షిణామూర్తికి విశేషాలంకారాలు

శ్రీకాళహస్తి జూన్ 27 ప్రభావార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన గురుదక్షిణామూర్తికి గురువారం ప్రత్యేకాభిషేకాలు,అలంకారాలు నిర్వహించారు. ఇక్కడి ఆలయంలో కంచుగడపకు ఎదురుగా వెలసిన గురుదక్షిణామూర్తి క్షేత్రపాలకుడని అంటారు. అంతేకాక ఆలయంలో కంచుగడప నుంచి అడుగుపెట్టిన వెంటనే మనకు దర్శనమిచ్చే గురుదక్షిణామూర్తి ఎంతో ప్రశాంత కల్పిస్తారు. ఈ నేపథ్యంలో ఇక్కడ ప్రతి గురువారం విశేష పూజలు అభిషేకాలను ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ స్వామి నిర్వహించటం ఆనవాయితి. అంతేకాక పట్టణంలోని కరణాల వీధి, మద్రాసురోడ్డుల్లో వెలసిన షరిడి సాయిబాబా ఆలయంలో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి బాబా ఆలయాల్లో భక్తులు సాయినామ కీర్తన,భజనలు, బాబాకు ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కంచుగడప నుంచి ప్రవేశిస్తూనే మొట్టమొదట దర్శనమిచ్చేది. గురుదక్షిణామూర్తి. ఇక్కడ దక్షిణామూర్తి క్షేత్రపాలకుడుగా విరాలజిల్లుతున్నారు.ఈ ఆలయం వద్ద ప్రతి గురువారం విశేష పూజలు అభిషేకాలు నిర్వహించటం ఆనవాయితి. ఇక్కడ గురుసంక్రమణ సందర్భంగా నిర్వహించే పూజలకు ఎంతో ఆదరణ ఉంది. తమిళనాడునుంచి భక్తులు విశేష సంఖ్యలో వస్తారు. ఉభయదారులుగా కూడా ఉన్నారు.ఇక్కడి ఆలయాన్ని భక్తుల భాగస్వామ్యంతో బంగారుతాపటం జరిపించారు.అంతేకాక గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద భక్తులు వరుస కట్టారు.ఉదయం ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ పర్యవేక్షణలో గురుదక్షిణామూర్తి ఆలయం ఎదుట కలశస్థాపన గావించారు.

## తిరుపతి ట్రాఫిక్‌కు మంచిరోజులు

### -ఎస్పీ స్వీయపర్యవేక్షణలో ఆక్రమణలు తొలగింపు -సులభ పార్కింగ్ గుర్తింపు



తిరుపతి,జూన్ 27ప్రభాతవార్త: జిల్లా కేంద్రం, స్మార్ట్‌సిటీ తిరుపతి నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీని నియంత్రించేందుకు స్వయంగా తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా నగర ట్రాఫిక్‌ను చక్కబెట్టేందుకు ముందుకు కదిలారు. ఆకస్మిక తనిఖీల్లో గురువారం ఉదయం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తన కార్యాలయం నుండి కృష్ణాపురంఠాణా, గాంధీరోడ్డు, నాలుక్కాళ్ళ మండపం, తిలక్‌రోడ్డు,ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. రోడ్డును ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తున్న వారందరినీ అక్కడ నుండి పంపేశారు. ఆ వస్తువులను సీజ్ చేశారు. పూలమతం వీధిలో దుకాణాలకు ఇరువైపులా రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. పాదచారులకు ఆటంకం లేకుండా చూడాలని డిఎస్పీలు రవిమనోహర చారి, రమణకుమార్‌లను ఆదేశించారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం ఆక్రమణలపై కొరఢా ఝుళిపించాలని ఆదేశాలిచ్చారు.

# మహిళా ఆర్థికస్వాతంత్ర్యంతోనే కుటుంబాలు బాగు : ఎమ్మెల్సీ

### - ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం సహకారం.. రైతులకు డ్రమ్‌లు.. టార్పాలిన్లు పంపిణీ

కుప్పం, జూన్ 27 ప్రభాతవార్త : మహిళలకు ఆర్థికస్వాతంత్ర్యంతోనే వారి కుటుంబాలు తద్వారా సమాజం బాగు పడుతుందని సిఎం చంద్రబాబునాయుడు విశ్వసిస్తారని ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం మండల కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జెసి శ్రీనివాసులుతో కలసి పిఎంఎజెఎవై పథకంలో భాగంగా కుప్పంలో 518మంది మహిళా రైతులకు 5వేల విలువ చేసే రెండు టార్పాలిన్లు, రూ 1830ల విలువ చేసే డ్రమ్ములను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ డా॥ కంచర్ల మాట్లాడుతూ కుప్పంలో పేదరికాన్ని రూపుమాపడమే సిఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. గత ముప్ఫై ఏళ్లలో జరిగిన అభివృద్ధికి మించి రానున్న ఐదేళ్లలో కుప్పాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. 2014లో మహారాష్ట్రకు చెందిన సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయంను పరిచయం చేశారన్నారు. 2014–19లో సిఎం చంద్రబాబునాయుడు విజ్ఞప్తితో పాలేకర్ ఏపిని దత్తత తీసుకుని పలు ప్రాంతాల్లో



రైతులకు ప్రకృతి సేద్యంపై శిక్షణ ఇచ్చారన్నారు. తద్వారా రైతులు నేడు ఈ విధానంపై మొగ్గుచూపుతున్నార న్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ కుప్పం ప్రాంతంలోని చాలా గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నార న్నారు. ప్రకృతి సంబంధమైన ఆవుపేడ, గోమూత్రంతో ఎరువులు తయారు చేసుకుని సేంద్రీయ విధానంలో పంటలు పండిస్తున్నార న్నారు. ఈపంట ఉత్పత్తులు ఆహారంగా తీసుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్యం, జీవన విధానం ఉంటుందన్నారు. ఈ తరహా వ్యవసాయంతో రైతులకు ఆదాయం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో అధికార శాతం రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిపిఎం వాసు, ఎస్సీ కార్పోరేషన్ ఇన్‌చార్జ్ ఇడి రాజ్యలక్ష్మి, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మహిళా నేత భాగ్యలక్ష్మి త్రిలోక్, మహిళా రైతులు పాల్గొన్నారు.